ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

బుధవారం 26 మార్చి 2025

****

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.105	170	200
నల్లగొండ	రూ.110	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.5 । కనిష్ఠం 20.0



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

30న హుజూర్‌నగర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

- పర్యటన షెడ్యూల్ ఖరారు
- ఉగాది పర్వదినాన సన్న బియ్యం పంపిణీ ప్రారంభం
- మోడల్ కాలనీ ఇళ్లను పరిశీలించనున్న సీఎం
- భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు

సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 30న సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో పర్యటించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఖరారు కావడంతో పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30ఆదివారం సాయంత్రం 6గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హుజూర్‌నగర్ పట్టణంలో ప్రారంభించనున్నారు.

- (ఆంధ్రజ్యోతి,హుజూర్‌నగర్)


హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం సాయంత్రం 5గంటలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి బయలుదేరి 5.45గంటలకు హుజూర్‌నగర్‌లోని రామస్వామి గట్టు వద్ద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం నిర్మాణంలో ఉన్న 2,160 ఇళ్ల మోడల్ కాలనీని సీఎం పరిశీలిస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 6.15 గంటలకు పట్టణంలోని ఫణిగిరిగట్టు వద్ద రాజీవ్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతారు. ఉగాది పర్వదినం సందర్భంగా బహిరంగ సభలోనే సీఎం రేవంత్ రెడ్డి సన్నబియ్యం పంపిణీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. 6.15 నుంచి 7.30గంటల వరకు సుమారు 40నిమిషాల పాటు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగసభలో ప్రసంగిస్తారు.

తిరిగి 7.30గంటలకు హుజూర్‌నగర్ నుంచి రోడ్డు మార్గంలో 9.45 గంటలకు హైదరాబాద్‌కు చేరుతారు. సభలో సీఎంతోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొంటారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 50వేల మంది సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు సాగుతున్నాయి. కాగా, సీఎం సభ సందర్భంగా మంగళవారం ఏర్పాట్లను పౌరసరఫరాశాఖ జాయింట్ సెక్రటరీ ప్రియాంకఅల, కలెక్టర్ తేజస్‌నందలాల్, ఎస్పీ నర్సింహులు, అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:34 (బుధవారం సాయంత్రం) | సహర్: 4:53 (గురువారం ఉదయం)

నెలాఖరులోగా భరోసా పూర్తయ్యేనా?



రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసాను నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో రైతుల ఖాతాలో జమ చేస్తామని పలుమార్లు ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రైతు భరోసాను ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 26న లాంఛనంగా ప్రారంభించింది. ఈ రోజున పైలెట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామం చొప్పున ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 గ్రామాలను ఎంపిక చేసి నూరు శాతం రైతుభరోసాను అమలు చేసింది. ఆ తరువాత కొందరి రైతులకే రైతుభరోసా అందింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- ఎదురుచూస్తున్న రైతులు
- సీజన్ గడిచిపోతున్నా పూర్తిస్థాయిలో అందని పెట్టుబడి సాయం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11లక్షల మందికి పైగా రైతులు

రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన, ఉమ్మడి జిల్లాలోని 73 గ్రామాల్లో, ఎంత సాగు భూమి ఉన్నా పూర్తి స్థాయిలో పెట్టుబడి సాయాన్ని చెల్లించింది. అనంతరం మూడు ఎకరాల వరకు రైతుభరోసా నగదును రైతుల ఖాతాల్లో జమచేసింది. ఆ తరువాత ఎన్ని ఎకరాలకు రైతుభరోసా ఇస్తామనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా గందరగోళంలో పడేసింది. చివరికి సాగులో ఎంత భూమి ఉన్నా రైతుభరోసా ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం దీనికి సంబంధించిన నగదు చెల్లించకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం గుట్టలకు, చెట్లకు, పుట్టలకు, రోడ్లకు, ఇటుక బట్టీల స్థలాలకు, వెంచర్ల స్థలాలకు రైతుబంధు పేరుతో డబ్బును వృథా చేసిందని నాడు కాంగ్రెస్ ఆరోపించింది.

అభిప్రాయాలు సేకరించినా..

గత పార్లమెంటు ఎన్నికల ముందు బీఆర్ఎస్ అమలు చేసిన రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేసింది. అయితే ఆ తరువాత ప్రభుత్వం రైతుభరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఎన్ని ఎకరాలకు రైతుభరోసా ఇవ్వాలనే దానిపై అభిప్రాయం సేకరించిన ప్రభుత్వం దాన్ని ఆటకెక్కించింది. అభిప్రాయాలపై అసెంబ్లీలో చర్చ పెట్టి అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం దీనిపై అసెంబ్లీలో చర్చను సైతం పక్కన పెట్టింది. రైతుల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ప్రభుత్వం జనవరి 26న రైతుభరోసా ప్రక్రియను ప్రారంభించినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. దీంతో వ్యవసాయ సీజన్‌లో రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక కొత్తగా పాస్‌పుస్తకాలు వచ్చిన రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వారు దరఖాస్తులు చేసుకున్నారు. వారితోపాటు పాస్‌పుస్తకాల్లో చేర్పులు, మార్పులు చేసుకున్న వారికి ఎకరం, రెండు ఎకరాలు, మూడు ఎకరాలు ఉన్న రైతులకు కూడా పెట్టుబడిసాయం అందలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రూ.24వేల కోట్లకు పైగా కేటాయించింది. అందులో రూ.18వేల కోట్లను రైతుభరోసాకే కేటాయిస్తున్నట్లు పేర్కొంది. ప్రభుత్వం ఈ నెలఖరులోగా ఐదెకరాల వరకు రైతుభరోసా ఇస్తామని పేర్కొన్నా, అవి వస్తాయా? లేదా అనే సందేహం నెలకొంది.

గతంలో 11సార్లు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి రైతుకు ఎంత భూమి ఉన్నా 11సార్లు రైతుబంధును అమలు చేసింది. అప్పట్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సుమారు ప్రతీ సీజన్‌లో రూ.1,450కోట్లకు పైగా రైతుబంధు వచ్చేది. ప్రస్తుతం 11లక్షల మందికి పైగా రైతులకు గతం మాదిరిగా ఎకరాకు రూ.6 వేల చొప్పున ఏటా రెండు సీజన్లకు రూ.12వేలు చెల్లిస్తే ప్రభుత్వంపై మరింత భారం పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో తక్కువ భూమికే రైతుభరోసా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా? లేదా? ఇప్పటికే చెప్పిన విధంగా సేద్యం చేస్తున్న భూమి అంతటికీ రైతుభరోసా కల్పిస్తుందా? అనేది వేచిచూడాల్సిందే.

ఉమ్మడి జిల్లాలో 11లక్షల మందికి పైగా రైతులు...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 11లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. అందులో నల్లగొండ జిల్లాలో 5.50 లక్షలు, సూర్యాపేట..



- మిగతా 7వ పేజీలో...

మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- నల్లగొండను రోల్‌మోడల్‌గా నిలపాలి : ఎస్పీ శరత్‌చంద్ర పవార్



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఉండి జిల్లాలో మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ ఆడిటోరియంలో ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందును ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రంజాన్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని, ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు పండగను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు మత సామరస్యంలో జిల్లాను రోల్‌మోడల్‌గా నిలపాలన్నారు. అందుకోసం అన్ని మతాలకు చెందిన వారు సోదరభావంతో మెలిగి భక్తి శ్రద్ధలతో పండుగలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, డీఎస్పీలు కొలను శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జయరాజు, సీఐలు,ఆర్ఐలు,ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సహకరించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్): యాసంగి ధాన్యం కొనుగోళ్లకు రైస్ మిల్లర్లు సంపూర్ణంగా సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. పెండింగ్ ట్రాన్స్‌పోర్ట్ బిల్లులు, పాత గన్నీ బ్యాగుల సమస్య, ఎఫ్‌సీఐ, 67 శాతం ఈలింగ్ వంటి సమస్యలను పరిష్కరించేందు సుముఖంగా ఉందన్నారు. మిల్లుల వారీగా పాతగన్నీ బ్యాగుల సమాచారాన్ని సేకరించాలని ఇన్‌చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో వానాకాలంలో జరిగిన లోపాలన్నింటినీ అధిగమించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్, ఇన్‌చార్జి డీఎస్‌వో హరీష్, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్, మార్కెటింగ్‌శాఖ ఏడీ ఛాయాదేవి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, భద్రాద్రి, తదితరులు పాల్గొన్నారు.

వీపీవో సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు మెరుగైన సేవల కోసం వీపీవో (విలేజ్ పోలీస్ ఆఫీసర్) సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం రాత్రి నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విలేజ్ పోలీసింగ్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని, అంతేగాక నేరాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లోకి కొత్తగా వచ్చే అనుమానితుల సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలు విలేజ్ పోలీస్ అధికారికి అందించాలన్నారు. సైబర్ మోసాలకు గురికాకుండా అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. యువకులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా దృష్టిసారించాలన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలను విక్రయిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, టూటౌన్ సీఐ రాఘరావు, రూరల్ ఎస్ఐ సైదాబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి అంతరెడ్డి

నల్లగొండ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ మండలంలోని దండెంపల్లి గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పాం సాగులో ఎదురయ్యే సమస్యలపై అధికారులను సంప్రదిస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. జిల్లాలో పెద్ద మొత్తంలో ఆయిల్‌పాం సాగుకు రైతులు మొగ్గు చూపడం అభినందనీయమన్నారు. మొక్కల పెంపకం, యాజమాన్య పద్ధతులు, డ్రిప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు గాదె శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా నియామకాలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి

నల్లగొండ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిన బోధనా సిబ్బంది నియామకాలను పారదర్శకంగా నిర్వహించామని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సిబ్బంది నియామకం కోసం మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇంటర్వ్యూకు 15 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఫలితాలను మెడికల్ కళాశాల వెబ్‌సైట్లో ఉంచుతామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, డాక్టర్ వినీలరాణి, డాక్టర్ మాతృ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

చిట్యాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ధర్మారెడ్డి, పిలాయిపల్లి వంటి చిన్ననీటి సాగు వనరులతో పాటు ఉదయసముద్రం, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం చిట్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు పనులతోపాటు కాల్వల నిర్మాణం పూర్తయితే జిల్లాలో ఇంత కరువు పరిస్థితులు ఉండేవి కాదన్నారు. ప్రాజెక్టుల పనుల పూర్తిపై ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. వరి చేలు ఎండిన రైతులకు ప్రభుత్వం రూ.30వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు వెంటనే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, అరూరి శ్రీను, పానుగుల్ల అచ్చాలు, బొబ్బల సుధాకర్‌రెడ్డి, కల్లూరి కుమారస్వామి, నకిరేకలంటి రాములు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

ఏఎస్పీ మౌనిక



దేవరకొండ బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ మౌనిక

దేవరకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఏఎస్పీ మౌనిక హెచ్చరించారు. మంగళవారం దేవరకొండ బస్టాండ్, ప్రధాన కూడలి వద్ద రోడ్ల వెంట వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారులతో ఆమె సమావేశమయ్యారు. రోడ్లపై వ్యాపారం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలన్నారు. ఆర్టీసీ అధికారులకు సహకరించాలని కోరారు. ఆమె వెంట ఆర్టీసీ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు, ఎస్ఐ అజ్మీర రమేష్, తదితరులు ఉన్నారు.

సాగర్ సీఐ బీసన్న బదిలీ

నూతన సీఐగా శ్రీనునాయక్

నాగార్జునసాగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ పోలీస్ సర్కిల్ సీఐ కె.బీసన్న బదిలీ అయ్యారు. ఆయన ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2023 మే నుంచి బీసన్న సాగర్ సీఐగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, ఆయన స్థానంలో నూతన సీఐగా నల్లగొండ డీసీబీలో పనిచేస్తున్న బి.శ్రీనునాయక్‌ను నియమించారు. ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు


వేములపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.2,800 గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ఏడాది యాసంగి సీజన్‌లో సన్నరకం ధాన్యానికి రూ.2,800కు పైగా ధర పలకగా, ఈ ఏడాది అదే ధాన్యానికి మిల్లర్లు సిండికేట్‌గా మారి రూ.2,200 నుంచి రూ.2,300 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. రైతు పండించిన ప్రతీ గింజకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. దీంతో రైతులు మిల్లర్లను ఆశ్రయిస్తూ ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రూ.500 పొందలేక పోతున్నారని అన్నారు. అంతేగాక మిల్లర్లు క్వింటాకు రూ.500 ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని దీంతో క్వింటాకు రూ.1,000 మేర రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక మిల్లర్లు తాలు, గుమస్తాల, హమాలీ పేరుతో అదనంగా మరో రూ.100 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మిల్లర్లు ఇష్టారాజ్యంగా రైతులను దోచుకుంటున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు.

ఇప్పటికైనా అధికార యంత్రాంగం మిల్లుల వద్ద పర్యవేక్షణ ఏర్పాటుచేసి ధాన్యానికి రూ.2,800 ధర కల్పించేలా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రెమడాల పరుశురాములు, రొండి శ్రీనివాస్, పాల్వాయి రాంరెడ్డి, పాదూరి గోవర్ధని, పుల్లెంల శ్రీకర్, కోడిరెక్క వెంకన్న, చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, వడ్డెగాని సైదులు, అనిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పుట్టల సైదులు, సత్యనారాయణరెడ్డి, వల్లమల్ల ఎల్లయ్య, మల్లిఖార్జున్‌రావు, పెంటమల్ల సుకన్య, శీలం పద్మ, మాధవి, రాధిక, చారి, తదితరులు పాల్గొన్నారు.

పంట తడి..రైతు కంటతడి

» ట్యాంకర్లతో నీళ్లుపోసి అప్పులపాలు » అరఎకరం కోసం 40 ట్యాంకర్ల నీరు

పంటలను కాపాడుకునేందుకు రైతులు నీటిని కొనుగోలు చేస్తున్నారు. నోటికాడికొచ్చిన పంట ఎండిపోతుండటం చూసి తట్టుకోలేక తడి ఇస్తే పంట చేతికి వస్తుందని ట్యాంకర్లతో మడులు తడుపుతూ అప్పులపాలవుతున్నారు. ఒక తడి తర్వాత మరో తడి ట్యాంకర్లతో నీరు కొనుగోలు వరి పంటకు పోస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)



మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని ఆరెగూడెంలో నీరు కొనుగోలు చేసి ట్యాంకరుతో వరి పంటకు పోస్తున్న రైతు బిక్షం

యాదాద్రి భువనగిరి జిల్లాలో కొంతమేర మూసీ నీరు అందుతుండగా మిగతా మండలాలు బావులు, బోర్లపై ఆధారపడి రైతులు సాగుచేస్తున్నారు. ఆలేరు, గుండాల, మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లోని కొంతభాగం బిక్కేరు వాగు వెంట ఉండటంతో చేతిబోర్లతో పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది (2024-25) వర్షాలు లేక చెరువులు, కుంటలు నిండలేదు. బిక్కేరు వాగు పారలేదు. బీమలింగంకాల్వ సౌకర్యం ఉన్నా కూరెళ్ల, పాలడుగు చెరువులు కూడా నిండలేదు. దీంతో బావులు, బోర్లలో భూగర్భ జలాలు తగ్గాయి. సాగునీరు ఉన్నంత మేరకే వరి సాగు చేశారు. గతంలో నాలుగు ఎకరాలు సాగు చేసే రైతు ఈ యాసంగిలో ఒకటిరెండు ఎకరాలే పంట వేశాడు. ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి పెట్టాడు. ముదురుతున్న ఎండలతో భూగర్భజలాలు తగ్గి వేసిన కొద్దిపాటి పంట కూడా ఎండిపోతోంది. వరి ఈని, అర్రవంచుతున్న దశలో ఎండిపోతున్న పంటను వదిలిపెట్టలేక ఒక తడి ఇస్తే పంట చేతికి వస్తుందన్న ఆశతో పలువురు రైతులు ట్యాంకర్లతో నీరు పోసి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్కో రైతు ట్యాంకర్ల కొద్దీ నీటిని కొనుగోలు చేసి పోస్తూ అప్పులపాలవుతున్నారు.

ట్యాంకర్ నీటితో పారేది రెండు, మూడు గుంటలు..

కొందరు రైతుల వరి పంట చిరుపొట్ట దశలోనే ఎండిపోయింది. వరుస తడులకు తిప్పుతూ పారించిన దాంట్లోనూ కొంత ఈని, గొలుసులు(గింజలు) దశలో ఎండిపోతోంది. ఒకట్రెండు తడులు ఇస్తే పంట చేతికి వస్తుందని భావించిన రైతులు ఒకరిని చూసి మరొకరు తడులు ఇస్తూనే ఉన్నారు. తీరా లెక్క చూసుకుంటే ఎకరాకు రూ.20వేల నుంచి 30 వేల ఖర్చువస్తోంది. ట్యాంకర్ నీటికి రూ.150, పొలం వద్దకు ట్రాక్టర్ రవాణా చార్జి రూ.500 నుంచి రూ.600. మొత్తం ఒక్కో ట్యాంకర్‌కు రూ.650 నుంచి రూ.750 ఖర్చవుతోంది. వరి చేను నీళ్లమీద ఉన్నప్పుడు పోస్తే 8ట్యాంకర్లకు ఎకరం పారుతోంది. ఎండిన తర్వాత పోస్తే ఒక్కో ట్యాంకరుకు 2, 3 గుంటలే పారుతుందని రైతులు చెబుతున్నారు.

గొర్రెలు, పశువులకు మేతగా పంట

వరి ఈని కంకి దశలో ఉంది.మరో పన్నెండు రోజులు నీరు పారిస్తే పంట చేతికి వస్తుంది. ట్యాంకర్లతో పోస్తే అప్పులపాలు కావడమే తప్ప తమకు మిగిలేమి ఉండదకున్న కొందరు రైతులు ఎండిపోయిన వరి చేనులో పశువులు, గొర్రెలు మేపుకోవడానికి ఇస్తున్నారు. వరి మేతకు ఇస్తే కొందరు గొర్రెల పెంపకం దారులు ఇంతో, అంతో డబ్బులు కూడా ఇవ్వడం లేదని, గొర్రె ఎరువు ఇస్తామని మేపుకుంటున్నారని కొందరు రైతులు చెప్పారు. ఎండిన వరి పంటకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

40 ట్యాంకర్ల నీరు పోశా...



ఈ యాసంగిలో నాకు ఉన్న బోరుబావి కింద ఒక ఎకరన్నర భూమిలో వరి సాగు చేశా. పంట మొదట్లో నీరు బాగానే ఉన్నా, రోజుకింత తగ్గింది. వరుస తడులకు తిప్పా. వరి ఈని గొలుసు ఎర్రబారుతోంది. దీంతో ఒకట్రెండు తడులు ఇస్తే పంట చేతికి వస్తుందన్న ఆశతో రూ.650కి ట్యాంకర్ చొప్పున మొదట నాలుగు ట్యాంకర్ల నీరు పోశా. అర ఎకరం నీరు తిరిగింది. ఎండలు ఎక్కువ కావడంతో త్వరగా పొలంలో తడి ఆరింది. మరోసారి ఆరు ట్యాంకర్లు, ఆ తర్వాత తొమ్మిది ట్యాంకర్ల చొప్పున ఇప్పటికి 40 ట్యాంకర్ల నీరు కొని పోశా. రూ.26 వేలు ఖర్చయ్యింది. అర ఎకరాకు సాగు పెట్టుబడి ఖర్చు రూ.12,500 కలిపి మొత్తం రూ.38,500 ఖర్చయ్యింది. అర ఎకరంలో 20 బస్తాల ధాన్యం వస్తుంది. అంటే 14 క్వింటాళ్లు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2300లకు విక్రయిస్తే రూ.32,200 వస్తాయి. ఇంకా రూ.6,300 నష్టమే. నా రెక్కల కష్టం వృథానే. ఎండిన పంటకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.
- జిట్ట బిక్షం, రైతు, ఆరెగూడెం

నీటి కొనుగోలుకు రూ.21 వేలు

ఆరెగూడెం గ్రామానికి చెందిన గడ్డం రమేష్ యాసంగిలో నీరు తక్కువగా ఉందని ఎకరం 10గుంటలే వరి వేశాడు. వ్యవసాయ క్షేత్రంలోని రెండు బావులు నీరు సాగుకు సరిపోవడం లేదు.దీంతో రూ.700లకు ట్యాంకరు చొప్పున కొనుగోలు చేసి ఒక్కోసారి నాలుగైదు ట్యాంకర్లు తెచ్చి బావిలో పోసి, ఆ నీరు, ఈ నీరు కలిపి పొలానికి పెట్టి కాపాడుకుంటున్నారు. ఇప్పటికి ఆరు పర్యాయాలు 30ట్యాంకర్ల నీరు పోసినట్టు రైతు రమేష్ చెప్పాడు. నీటి కొనుగోలుకే రూ.21 వేలు అయ్యాయని, ఇక తనకు మిగిలేదమిటని రైతువాపోతున్నాడు.

కూర'గాయాల' సాగు

కూరగాయల సాగుతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండిస్తున్నా మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు. ప్రధానంగా టమాట, వంకాయ ధరలు పడిపోవడంతో రైతులు విలవిలలాడుతున్నారు. కాయలు తీసే కూళ్లు కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో చెట్ల మీదనే వదిలి వేసే విపత్కర పరిస్థితి నెలకొంది. బహిరంగ మార్కెట్‌లో ధర కనిపిస్తున్నా వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నిలువునా దోస్తున్నారు. తక్కువకు కొనుగోలు చేసి బయట ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)

కోసే కూలి కూడా రాక పంటను వదిలేస్తున్నరైతులు



చెట్లకే వదిలేసిన టమాటలు

టమాట ధరలు పాతాళంలో పడిపోయాయి. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి రైతులను నిలువుదోపిడి చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారులతో రైతులు ఘర్షణలు పడిన సంఘటనలూ అనేకం ఉన్నాయి. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాక రైతులు అప్పులపాలు కావాల్సి వస్తోంది. రైతు వద్దకు తక్కువకు తీసుకుని బహిరంగ మార్కెట్‌లో ఎక్కువకు విక్రయిస్తున్నారు. రైతుల వద్ద కిలో రూ.10 నుంచి 15లకు కొనుగోలు చేసే వంకాయలను స్థానిక మార్కెట్‌లోని వ్యాపారులు రూ.50 నుంచి రూ.60లకు విక్రయిస్తున్నారు.

ఓ రైతు దీనగాథ ఇది

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలోని లక్కారం(8వ వార్డు) కు చెందిన రైతు పాశం కృష్ణ గత ఏడాది నుంచి తనకున్న ఎకరం 20 గుంటల వ్యవసాయ భూమిలో కూరగాయల పంటలను సాగుచేస్తున్నాడు. రాళ్ల రప్పలతో నిండి ఉన్న భూమిని రూ.వేలు ఖర్చుచేసి సాగుకు యోగ్యంగా మార్చుకున్నాడు. రెక్కల కష్టాన్ని నమ్ముకున్న కృష్ణ కూరగాయల సాగుపై దృష్టి సారించాడు. టమాట, వంకాయ, బీరకాయ, సొరకాయ తదితర కూరగాయల పంటలను సాగు చేస్తున్నాడు. సూర్యుడు రాక ముందే తోటలోకి వెళ్లి కూరగాయలు తీయడం, మార్కెట్ తరలించడం, మార్కెట్‌లోని వ్యాపారులకు చేరవేయడం ఆయనకు నిత్యకృత్యం. కానీ కష్టానికి తగిన ఫలితం రాకపోవడంతో నిత్యం అసహనంతోనే గడుపుతున్నాడు. చేసిన కష్టం పోయినా సరే కానీ పెట్టుబడులు కూడ రాక పోయే సరికి తీవ్రంగా మదనపడాల్సి వస్తోంది. అయినా సరే ఎప్పుడో ఒకసారి మంచి రోజులు రాక పోతాయా అంటు భవిష్యత్‌పై ఆశతో సాగును కొనసాగిస్తున్నాడు. వంకాయ మొక్కలను నాటిన 50 నుంచి 60 రోజుల్లో కాయలు, టమాట మొక్కలు 70 నుంచి 75 రోజుల్లో కాయలు, సోరకాయ విత్తనాలు నాటిన 45 రోజుల్లో కాయలు చేతికి వస్తాయని రైతు కృష్ణ తెలిపాడు.

125 ఎకరాల్లో కూరగాయల సాగు

చౌటుప్పల్ మండలంలో 125 ఎకరాల్లో రైతులు కూరగాయల సాగు చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు తెలిపారు. అనావృష్టి పరిస్థితులతో కూరగాయల సాగు తగ్గిపోయిందని, ధర్మాజీగూడెంలో ఆకుకూరల సాగును సుమారు 30 నుంచి 35 మంది రైతులు చేస్తున్నట్లు ఏవో తెలిపారు.

రూ. 2 లక్షలకు వరకు నష్టం

ఆరు నెలల కిందట కృష్ణ కూరగాయల సాగు మొదలు పెట్టినప్పుడు ధరలు బాగా మండిపోతున్నాయి. టమాట రూ.40 హోల్‌సేల్ ధర పలుకుతుండగా, వంకాయ రూ.40ల వరకు పలికింది. ఈ క్రమంలో 10 గుంటల్లో వంకాయ, మరికొంత భూమిలో టమాట సాగు చేశాడు. తీరా దిగుబడి వచ్చే సమయంలో ధరలు నేలచూపులు చూస్తున్నాయి. టమాట ధర హోల్‌సేల్‌గా రూ.4లకే పరిమితం అవడంతో కోతలు కూడా నిలిపివేశాడు. దీంతో సుమారు పెట్టుబడిగా పెట్టిన రూ.50 వేల ఖర్చు నష్టపోవాల్సివచ్చింది. దీనికి తోడు 10 గుంటల్లో వంకాయ సాగు చేయగా రూ.15లు మాత్రమే హోల్‌సేల్ ధర ఉంది. దీంతో ఆ పంటను అక్కడే వదిలేశాడు. రెండు నెలల కిందట కూడా వంకాయ పంట సాగులో రూ.25 వేల వరకునష్టపోయాడు. సుమారు ఆరు నెలల్లో రూ.2 లక్షల వరకు పెట్టుబడులు, కూలీల ఖర్చులు కృష్ణ నష్టపోయాడు.

కనీస ధరలు లేక నష్టాలకు గురి కావాల్సి వస్తోంది..



కూరగాయలకు మార్కెట్‌లో కనీస ధరలు లేకపోవడంతో నష్టాలకు గురికావలసి వస్తోంది. మూడు నెలల క్రితం వంకాయల ధరలు గణనీయంగా పడిపోవడంతో 10గుంటలలో సాగు చేసిన ఆ తోటను కాయలను వదిలివేశాను. ప్రస్తుతం వంకాయ, టమాట, సోర కాయ పంట చేతికి వచ్చింది. కానీ ధరలు లేక పోవడంతో నష్టాల బారిన పడాల్సి వస్తోంది. పంటచేతికి వచ్చే సమయంలోనే మార్కెట్ ధర లు లేకపోవడంతో ఇబ్బంది పడవల్సివస్తోంది. చివరకు పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితి ఏర్పడింది. సీజన్ వారీగా లాభదాయకంగా ఉండే పంట ల సాగు కోసం అన్వేషణ చేస్తున్నాం. నష్టాల బారి నుంచి బయడపడేందుకు ప్రయత్నిస్తున్నా.
- పాశం కృష్ణ, రైతు,చౌటుప్పల్

బిర్యానీ సెంటర్‌లో భారీ పేలుడు

పేలుడుధాటికి చెల్లాచెదురై రోడ్డుపై పడిన సామాన్లు



పేలుడు ధాటికి చెల్లాచెదురుగా హైదరాబాద్ రోడ్డుపై పడిన హోటల్ సామగ్రి, హోటల్‌లో చెలరేగిన మంటలు

నల్లగొండ క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ బిర్యానీ సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. పేలుడు ధాటికి బిర్యానీ సెంటర్ షట్టర్, గేటు సహా లోపల సామాన్లు అన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. నల్లగొండ టూ టౌన్ ఎస్ఐ ఎర్ర సైదులు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంజాన్ మాసం ప్రారంభం కావడంతో నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో పూజిత అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న హాట్ బకెట్ బిర్యానీ సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి వరకూ తెరిచే ఉంది. సుమారు ఒంటి గంట తర్వాత సెంటర్ మూసివేసిన 15 నిమిషాల అనంతరం బిర్యానీ సెంటర్‌లో భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి హోటల్ సామగ్రి మొత్తం రోడ్డుపైన పడటంతో స్థానికులు గమనించి పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఫైర్‌స్టేషన్ అధికారులు మంటలను ఆర్పారు.

పేలుడుపై సందిగ్ధం

హాట్‌బకెట్ బిర్యానీ సెంటర్‌లో పేలుడు ఘటనపై నిర్ధారణకు రాలేకపోతున్నారు. బిర్యానీ సెంటర్‌లో గ్యాస్‌సిలిండర్ ఏవీ పేలలేదని, ఒక వేళ షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అదేసమయంలో పేలుడులో మరేదైనా కుట్ర కోణం దాగి ఉందా అని ఆరా తీస్తున్నట్లు సమాచారం. బిర్యానీ సెంటర్ నిర్వాహకుడు బబ్లూ ఫిర్యాదు మేరకు నల్లగొండ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య

కోదాడ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కోదాడ మండలం మంగళితండాలో అనారోగ్యంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ రాజా తెలిపారు. తండాకు చెందిన ధరావత్ బాబునాయక్(65) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్రమానసిక వేదనకు గురైన మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా గమనించిన కుటుంబసభ్యులు అతడిని కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. బాబునాయక్ కుమారుడు లింగానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

గట్టికల్లులో విషాదం



రాంప్రసాద్(ఫైల్)

ఆత్మకూరు(ఎస్), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం గట్టికల్ గ్రామవాసి బెజ్జంకి రాంప్రసాద్(35) హైదరాబాద్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనతో గ్రామంలో మంగళవారం విషాదం అలుముకుంది. బతుకుదెరువు కోసం గతేడాది హైదరాబాద్‌కు వెళ్లిన రాంప్రసాద్ హైదరాబాద్‌లోని మౌలాలీలో భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నారు. తన కులవృత్తి అయిన కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. చాలీచాలని వేతనంలో కుటుంబం పోషించడం కష్టంగా మారింది. కొద్ది రోజులుగా ఆర్థిక సమస్యలతో కుటుంబంలో వివాదాలు మొదలయ్యాయి. దాంట్లో భాగంగానే సోమవారం రాత్రి ఇంట్లో చికాకుతో వెళ్లిన రాంప్రసాద్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. రాంప్రసాద్ ఘట్‌కేసర్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై సోమవారం రాత్రి మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు. రాంప్రసాద్ మృతదేహాన్ని గట్టికల్‌కు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. రాంప్రసాద్‌కు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రేషన్ బియ్యం అక్రమరవాణా నిందితుల అరెస్ట్

● పరారీలో మరో ఆరుగురు నిందితులు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రెండు వేర్వేరు కేసుల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేసినట్లు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. మరో ఆరుగురు పరారీలో ఉన్నారని మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 21న ఉదయం 11 గంటలకు మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య కొత్తగూడెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా లారీ, ట్రాలీ వాహనాలు రోడ్డు పక్కకు ఆపి ఉండటం చూసి అక్కడికి వెళ్లారు. పోలీసుల రాకను గమనించి కొందరు పారిపోగా, లారీ డ్రైవర్ అమ్మోరును పట్టుకుని, లారీని, ట్రాలీ వాహనాలను తనిఖీ చేశారు. 66 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి అమ్మోరిని విచారించి అదేరోజు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీతెలిపారు. అతను తెలిపిన సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దాచేపల్లికి చెందిన మందపాటి నర్సింహారావు, నరేందర్, మాదినేటి చంద్రశేఖర్, అప్పారావులు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో వివిధ గ్రామాల్లో రేషన్ బియ్యం లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.8-10కి కొనుగోలు దేవరకొండ అమ్మోరు ద్వారా వాహనాల్లో లోడింగ్ చేయించి కృష్ణపట్నం పోర్టుకు, పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు దగ్గరలోని కోళ్ల ఫారాలకు కిలో రూ.25-40లకు విక్రయిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఆ కేసులోని నిందితుడు మాదినేటి చంద్రశేఖర్‌ను వాడపల్లి సరిహద్దు వద్ద అరెస్ట్ చేయగా మందపాటి నరేందర్, అప్పారావులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

నాగార్జునసాగర్ కేసులో..

ఈ నెల 21న మధ్యాహ్నం నాగార్జునసాగర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా హాలియా నుంచి నెంబర్‌ప్లేట్ లేని వాహనం వేగంగా వచ్చి బారీకేడ్లను ఢీకొట్టి ఆగింది. అందులో ప్రయాణిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెంటచింతల మండలం మంచికల్లుకు చెందిన నెమలి నాగిరెడ్డి, మధులను అదుపులోకి తీసుకుని విచారించగా అదే గ్రామానికి చెందిన నారాయణ, ఓంకార్‌రెడ్డి, నల్లగొండ జిల్లా హాలియా మండలం చలకుర్తికి చెందిన సైదిరెడ్డి, నెల్లికల్‌కు చెందిన శ్రీధర్‌రెడ్డిలతో కలిసి రేషన్‌బియ్యం అక్రమ రవాణా చేస్తున్నట్లు తేలిందన్నారు. నాగిరెడ్డి, మధులతో పాటు వాహనంలోని 20క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నారాయణ, శ్రీధర్‌రెడ్డి, సైదిరెడ్డి, ఓంకార్‌రెడ్డిలు పరారీలో ఉన్నారన్నారు. రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, సాగర్ సీఐ బీసన్న రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య, త్రిపురారం ఎస్ఐ ప్రసాద్, విజయపురి ఎస్ఐ సంపత్ పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



ట్యాంకర్‌ను ఢీకొని నుజ్జయిన కారు

అనంతగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన సోమ కృష్ణారెడ్డి(43) ఆయనతో పాటు నంద్యాల ఉపేందర్‌రెడ్డి, గోపిరెడ్డి బ్రహ్మారెడ్డిలు మంగళవారం ఉదయం ఖమ్మంలో తన స్నేహితుడి ఇంట్లో ఎల్లమ్మ పండుగకు వెళ్లారు. తిరిగి సాయంత్రం వస్తుండగా వారితో పాటు అమ్మిరెడ్డి పద్మావతి(32) కూడా కారులో బయలుదేరింది. అనంతగిరి మం డలం శాంతినగర్ గ్రామం వద్ద జాతీయ రహదారిపై మొక్కలకు నీరు పోస్తున్న వాటర్ ట్యాంక్‌ను కారు వెనుక నుంచి ఢీకొనడంతో సోమ కృష్ణారెడ్డి, పద్మావతిలు అక్కడికక్కడే మృతి చెందారు. నంద్యాల ఉపేందర్‌రెడ్డి, గోపిరెడ్డి బ్రహ్మారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం కోసం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

రోడ్డు దాటుతుండగా...



నాగేశ్వర్‌రావు(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) :యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెంలో హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గోరిపర్తి నాగేశ్వర్ రావు(52) దివీస్ పరిశ్రమ సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నారు. ఉదయం హోటల్ వద్దకు వెళ్తూ రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో నాగేశ్వర్ రావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. నాగేశ్వర్‌రావు కుమారుడు కృష్ణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మరో ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

నల్లగొండ జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం శివారు మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ముందుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. అనంతరం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మట్టి దిబ్బను ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైకుపై వెళ్తున్న ఆదిత్య, బన్ని యువకులతో పాటు కారులో ప్రయాణిస్తున్న గిరిరావు, ప్రకాశ్‌రావు, వీరభద్రంకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీనివాస్

హుజూర్‌నగర్ , మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం గోపాలపురం సమీపంలోని రైస్ మిల్లుల వద్ద లారీ అదుపు తప్పి ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయయి. రాడ్‌బెండింగ్ చేస్తున్న మేళ్లచెర్వుకు చెందిన శ్రీనివాస్ అనే కార్మికుడిని లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. మద్యం మత్తులో లారీతో వస్తున్న డ్రైవర్ మిర్యాలగూడ వైపు నుంచి హుజూర్‌నగర్‌కు వస్తున్న సమయంలో శ్రీనివాస్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలు కాగా అతడిని 108లో ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

స్నేహితులతో కలిసి కాల్వలో ఈతకెళ్లిన విద్యార్థి

ఒడ్డుపై కూర్చుని జారుతూ నీళ్లలో పడి గల్లంతైన వైనం




ఉదయ్‌కుమార్ (ఫైల్)

నల్లగొండ క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం తీసింది. స్నేహితులతో కలిసి వెళ్లిన ఆ విద్యార్థికి ఈత రాకపోవడంతో కాల్వఒడ్డుపై కూర్చుని ప్రమాదవశాత్తు నీళ్లలో జారిపడి మృతిచెందాడు. మంగళవారం నల్లగొండ జిల్లా నల్లగొండ మండల పరిధిలో ఈ సంఘటన జరిగింది. నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం గ్రామానికి చెందిన పోతుగంటి ఉదయ్‌కుమార్(20) నల్లగొండలో హాస్టల్‌లో ఉంటూ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఆరుగురు స్నేహితులతో కలిసి మండల పరిధిలోని దండెంపల్లిలో ఉన్న ఏఎంఆర్‌పీ కాల్వ వద్ద ఈతకు వెళ్లాడు. విద్యార్థుల్లో ముగ్గురికి ఈత రాగా, మరో ముగ్గురికి ఈత రాదు. ముగ్గురూ ఈత కొడుతున్న క్రమంలో ఇద్దరితో కలిసి ఉదయ్‌కుమార్ కాలువ ఒడ్డుపై కూర్చున్నాడు. విద్యార్థులు కాల్వలో ఇవతలి ఒడ్డు నుంచి అవతలి ఒడ్డుకు ఈత కొడుతూ వెళ్లారు. ఈ సమయంలో ఉదయ్‌కుమార్ కాల్వలో క్రమంగా జారుతూ నీళ్లలో మునిగిపోయాడు. కాల్వలో లోతు ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. తోటి విద్యార్థులు కేకలు వేయంతో పొలాల వద్ద ఉన్న వారు వచ్చి చూసి పోలీసులకు సమచారం ఇచ్చారు. నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు సిబ్బందితో కలిసి ఫైర్, మత్యశాఖ అధికారులు, సిబ్బంది సహకారంతో ఉదయ్ మృతదేహాన్ని కాల్వ నుంచి బయటికి తీశారు. ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

మాజీ సర్పంచ్ చక్రయ్య హత్య కేసులో

మరో 15 మంది అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనునాయక్

సూర్యాపేట క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాలలో ఇటీవల జరిగిన గ్రామ మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్య హత్య కేసులో మరో 15 మందిని అరెస్ట్ చేసినట్లు తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్ తెలిపారు. మంగళవారం సూర్యాపేటలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. గ్రామంలో రాజకీయ ఆధిపత్యం కోసం ఈ నెల 17న మెంచు చక్రయ్యను హత్య చేశారన్నారు. కేసుకు సంబంధించి ఇప్పటివరకు 13 మందిని అరెస్ట్ చేయగా, మరో ఆరుగురు కోర్టులో లొంగిపోయారన్నారు. మంగళవారం మరో 15 మందిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. అయితే హత్యలో పాల్గొన్న వారికి, హత్యకు కుట్ర పన్నిన వారికి సహకరించిన వారిలో మిర్యాలకు చెందిన అనంతుల నాగరాజు, మోసంగి భరత్, పెద్దింటి గంగమల్లు, కనకటి సతీష్, చెలగల సంతోష్, పెద్దింటి నాగయ్య, కట్ల వెంకన్న, వీరమల్ల మల్లయ్య, వర్దెల్లి మహేష్, మోసంగి రాకేష్, తరాజుల సైదులు, అనంతుల శ్రీధర్, పెద్దింటి మహేష్, ఉప్పల వెంకన్న, పెద్దింటి లింగస్వామి ఉన్నారని వీరందరు నూతనకల్ మండలంలోని ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద సంచరిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. కేసుకు సంబంధించి ఇంకా కొంతమంది నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉందని, వారిని కూడా త్వరలోనే పట్టుకుని రిమాండ్ చేస్తామన్నారు. సమావేశంలో నూతనకల్ ఎస్ఐ మహేంద్రనాద్, సిబ్బంది నారాయణ ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళిక



వేసవిలో మునిసిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా ప్రత్యేక నిధులు కేటాయించి ప్రైవేటు బోర్లు అద్దెకు తీసుకున్నారు. అవసరమైన చోట మరిన్ని నిధులు కేటాయిస్తామని వారు వెల్లడించారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

- వేసవిలో అవసరమైన చోట అద్దెకు ప్రైవేట్ ట్యాంకర్లు, బోర్లు
- భువనగిరిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్
- నల్లగొండలో మూడు నెలలకు సరిపడా నిల్వ

(ఆంధ్రజ్యోతి- భువనగిరి టౌన్): భువనగిరి పట్టణంలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివా రణకు మునిసిపల్ అధికారులు మందస్తు జాగ్రత్తలు చేప ట్టారు. ప్రస్తుతం పట్టణంలో తాగునీటి సమస్య లేనప్పటికీ ఏప్రిల్, మే మాసాల్లో వేసవి తీవ్రత, నీటి వినియోగం పెరిగే అవకాశాలు ఉండటంతో ఆదిశగా అధికారులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. రూ.20 లక్షలు కేటా యించారు. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని అధికారులు అంటున్నారు.

భువనగిరిలో నీటి సరఫరా ఇలా..

భువనగిరి పట్టణంలోని 35 వార్డుల్లో సుమారు 12వేల గృహాల్లో సుమారు 77 వేల జనాభా ఉంది. ప్రస్తుతం ప్రతి రోజు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ (హెచ్ఎండబ్ల్యూఎస్)ద్వారా 5.46 ఎంఎల్‌డీ కృష్ణా జలాలు, 128 పవర్ బోర్లు, 2 అద్దె బోర్ల ద్వారా మరో 5 ఎంఎల్‌డీ స్థానిక జలా లు మొత్తంగా రోజు వారీగా 10.46 ఎంఎల్‌డీ నీరు నల్లాల ద్వారా సరఫరా అవుతున్నది. అయితే నిర్దేశిత బస్తీల్లో కృష్ణా జలాలు మూడు రోజులకోసారి, స్థానిక జలాలు రోజు విడిచి రోజు సరఫరా గంట నుంచి గంటన్నర పాటు జరుగుతున్నది. అలాగే 24 చేతి పంపులు వినియోగంలో ఉండగా ఇందిరమ్మకాలనీ, సరస్వతి నగర్ తదితర బస్తీల్లో మూడుట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణంలో 70.10లక్షల లీటర్ల నిల్వ సామర్థ్యం ఉన్న అన్ని స్థాయిల్లో ట్యాంకులు 21 ఉన్నాయి. దీంతో ప్రతిరోజు ఒక్కొ క్కరికి 135 లీటర్ల నీటి సరఫరా జరుగుతున్నది.

ప్రణాళిక ఇలా..

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకు రూ.20 లక్షలు కేటాయించారు. అవసరమైతే 15 ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లను అద్దెకు తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే మూడు ప్రైవేట్ బోరు బావులు, నాలుగు వాటర్ ఫిల్లింగ్ పాయింట్లను సిద్ధం చేశారు. పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు. నీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్నారు. వేసవిలో నీటి సర ఫరాకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు. నీటి సరఫరాపై వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్క రించేలా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని అధికారులు ఆదేశించారు.



తాగునీటి ఎద్దడిని రానివ్వం

వేసవిలో తాగునీటి ఎద్దడిని రానివ్వం. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. రూ. 20లక్షలు కేటా యించాం. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తాం. తాగునీటి కోసం ప్రజలు ఆందోళనకు గురికావద్దు. వేసవిలో కూడా యథావిధిగా నీటి సరఫరా జరుగుతుంది. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలి. తాగునీటి సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే మునిసిపల్ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావాలి.

- రామలింగం,మునిసిపల్ కమిషనర్, భువనగిరి



నల్లగొండలో తాగునీటి సమస్య లేనట్టే

ఉదయ సముద్రంలో సరిపోను నీటి నిల్వలు



రామగిరి : నల్లగొండ పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. పానగల్ పంప్‌హౌస్ (ఉదయసముద్రం)లో ప్రస్తుతం 1.52 టీఎంసీ నీరు నిలువ ఉంది. పట్టణంలో 48 వార్డుల్లో 2,34,495 జనాభా ఉంది. 42192 గృహాలు ఉండగా 32వేల పైచిలుకు గృహాలకు నల్లా కనెక్షన్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే పట్టణానికి ప్రతిరోజు 0.37 ఎంఎల్‌డీ చొప్పున నీరు సరఫరా అవుతుంది. ఈ లెక్క ప్రకారం జూన్ వరకు తాగునీటి సమస్య ఉండబోదని అధికారులు చెపుతున్నారు. ఇకపోతే నీలగిరిలో అమృత్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చినందున బహిరంగా కనెక్షన్లు తొలగించారు. ఇకపోతే మంచినీరు శుద్ధి చేసే క్రమంలో ప్రతిరోజు 0.16ఎంఎల్ డీ చొప్పున నీరు వృధా అవుతుందని చెపుతున్నారు.




జూన్ వరకు సమస్య ఉండదు

ఉదయ సముద్రంలో ప్రస్తుతం 1.52 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రతి రోజు 0.37 ఎంఎల్‌డీ చొప్పున సరఫ రా అవుతోంది. ఈ లెక్క ప్రకారం ప్రస్తు తం నీల్వ ఉన్న నీరు మూ డు నెలల సరి పోనుంది.

-సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్, నల్లగొండ

దేవరకొండ శివారు కాలనీలకు అందని కృష్ణాజలాలు



దేవరకొండలో తాగునీటిని అందించే ట్యాంక్

దేవరకొండ : దేవరకొండ మునిసిపాలిటిలోని శివారు కాలనీలకు సరిపడా కృష్ణాజలాలు రాకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులుపడుతున్నారు. దేవరకొండ పట్టణంలో 20 వార్డులకు 50వేలకు పైగా జనాభా ఉంది. పట్టణంలో 8,489 మిషన్‌భగీరథ నల్లాల కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి రోజు 42 లక్షల లీటర్ల నీటిని పట్టణానికి సరఫరా చేస్తున్నారు. శివారు కాలనీలైన హనుమాన్‌నగర్, చంద్రన్నకాలనీ, తాటి కోలు రోడ్డు, సంజయ్‌కాలనీ, ముత్యాలమ్మ వీధి కాలనీలకు సరిపడా కృష్ణాజలాలు రాకపోవడంతో బోరు నీరు తెచ్చు కొని తాగుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవరకొండ మునిసిపాలిటీకి మరో 10లక్షల లీటర్ల నీరు అదనంగా సరఫరా చేయాలని ప్రజలు కోరు తున్నా రు. హనుమాన్‌నగర్‌లో నాలుగు రోజులకు ఒక్కసారి నీటి సరఫరా అవుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. మునిసిపాలిటీ పరిధిలో 84 బోర్లు పని చేస్తున్నాయి. 13 బావులకు మోటర్లు బిగించి నీటిని సరఫరా చేస్తున్నారు. కాలనీలకు తీవ్రంగా నీటి ఎద్దడి ఏర్పడితే మూడు ట్యాంకర్లను సిద్ధం చేశామని అధికారులు తెలుపుతున్నారు. తరచుగా విద్యుత్ అంతరాయం, పైపులు పగిలి పోతుండడంతో కృష్ణాజలాల సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో మూడు, నాలుగు రోజులవరకు నీటి సరఫరా నిలిచిపోతుండడంతో పట్టణ ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులుపడే పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ అంత రాయం కలుగకుండా, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం



దేవరకొండ పట్టణానికి ప్రతిరోజు 42లక్షల లీటర్ల భగీరథ నీరు సరఫరా అవుతోంది. నీటిని అన్ని వార్డులకు వంతులవారీగా సరఫరా చేస్తున్నాం. దీంతోపాటు బోర్లు బావులకు మోటర్లు బిగించి నీటిని అందజేస్తున్నాం. పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం.

- సుదర్శన్, మునిసిపల్ కమిషనర్ , దేవరకొండ

ఆలేరులో రెండు పూటలా నీటి సరఫరా

ఆలేరు : ఆలేరు మునిసిపాలిటీ పరిధిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు కమిషనర్ చేపట్టిన ముందు జాగ్రత్తతో పట్టణంలో రెండు పూటలు నీటి సరఫరా జరుగుతుంది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ద్వారా మునిసిపాలిటీకి సమ్మర్ యాక్షన్ ప్లాన్ నిధులు ఇప్పటి వరకు మంజూరు కాలేదని తెలిసింది. గతేడాది 2024-25 ఆర్థిక సంవత్సరంలో యాక్షన్ ప్లాన్‌లో మునిసిపాలిటీకి రూ.34 లక్షలు మంజూరయ్యాయి. పట్టణంలో ఎక్కడ నీటి సమస్య తలెత్తకపోవడంతో ఆ నిధులు ఇప్పటికీ అలాగే ఉండిపోయాయని కమిషనర్ తెలిపారు. 2025 జనాభా లెక్కల ప్రకారం మునిసిపాలిటీ పరిధిలో మొత్తం జనాభా 22,590 మంది ఉన్నారు. పట్టణంలో 12 వార్డులు ఉండగా నల్లా కనెక్షన్లు 3,665 ఉన్నాయి. వీరిలో పబ్లిక్ నల్లా కనెక్షన్లను ప్రభుత్వం నిషేధించడంతో ప్రతి ఇంటికి మునిసిపాలిటీ నల్లా కనెక్షన్ అనుమతి ఇచ్చింది. అలాగే మిషన్ భగీరథ పథకం కింద ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చారు. రోజుకు 1.25 ఎంఎల్‌డీ నీటి సరఫరా అవుతోంది. మిషన్ భగీరథ నీటితో పాటు 49 మునిసిపల్ బోర్లు ,6 అద్దె బోర్ల ద్వారా 22 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను నిం పి రోజుకు పట్టణ ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నారు. సాంకేతిక సమస్యలు ఏర్పడితే కాలనీ ప్రజలకు నీటి సరఫరా జరిపించేందుకు ట్యాంకర్‌ను ఒకటి అందుబాటులో ఉంచారు. ఇప్పటి వరకు పట్టణంలో ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకపోవడం గమనార్హం.

లక్ష్మీ సమేతుడికి లక్ష పుష్పార్చన



స్వామి వారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామా పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమన రీతిలో గంటపాటు పూజ పర్వం కొనసాగింది.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్ర గమ శాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరుడికి ముఖ మండపంలో నిస్పటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొన సాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 22,79,976 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

నేడు హుండీ లెక్కింపు

స్వామివారి హుండీ లెక్కింపు బుధవారం ఉదయం 7 గంటలకు కొండకింద వ్రత మండపంలో లెక్కింపు ప్రక్రియ మొదలవుతోంది.2025 జనవరి 20 నుంచి మార్చి 25 వరకు మొత్తం 65 రోజుల హుండీ లెక్కించనున్నన్నారు. ఇందులో 2025 ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు స్వర్ణ దివ్య వి మాన రాజగోపుర మహాకుంభాభిషేక మహోత్సవం, అదే రోజు (ఫిబ్రవరి 23) నుంచి 28 వరకు మహాశివరాత్రోత్సవాలు, ఆ మరుసటి రోజు (మార్చి 1 నుంచి 11వ తేదీ) వరకు లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగాయి. వరుస ఉత్సవాల నేపథ్యంలో భారీగా హుండీ ఆదాయం సమకూరే అవకాశం ఉన్నట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. కాగా, 2024 డిసెంబరు 3 నుంచి 2025 జనవరి 19 వరకు 48 రోజుల్లో ఆలయ ఖజానాకు రూ. 4,17,1 3,596 హుండీ ఆదాయంతో పాటు 228 గ్రాముల మిశ్రమ బంగారం, 7.050 కిలోల మిశ్రమ వెండీ సమకూరింది.

సమస్యల నిలయంగా సంక్షేమ బోర్డు



భువనగిరిలో సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి

భువనగిరి గంజ్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు సమస్యల నిలయంగా మారిందని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం భువనగిరి పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం దాసరి లక్ష్మయ్య అధ్యతన జరిగింది. కొన్ని నెలలుగా కార్మికులకు డబ్బులు ఇవ్వడం లేదని, ఆన్‌లైన్‌లో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పరిష్కరించడంలో లేబర్ డిపార్ట్మెంట్ వైఫల్యం చెందిందని ఆరోపించారు. కార్మిక సంక్షేమ బోర్డులో జమ కావాల్సిన సెస్ సక్రమంగా వసూలు చేయనందున కార్మిక సంక్షేమ నిధులు పెరగడం లేదన్నారు. సంక్షేమ బోర్డును ఎత్తి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, దానిని రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానా లు తిప్పికొట్టేందుకు ఢిల్లీలో ఈ నెల 28న మహాధర్నా నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బోలగాని సత్యనారాయణ, గోరేటి రాములు, సభ్యులు ఎండీ ఇమ్రాన్, బీరకాయల మల్లేష్, సామల శోభన్‌బాబు, కొల్లూరి మల్లేష్, దుబ్బాక సంజీవ, జహంగీర్, బాలరాజు, సందయ్య, యాదగిరి పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధి కోసమే పెరటి కోళ్ల పంపిణీ



రాజాపేట : నెమిలలో పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ప్రధాన శాస్త్రవేత్త బస్వారెడ్డి

రాజాపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో మహిళల అభివృద్ధి కోసం పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్నట్లు జాతీయ మాంస పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బస్వారెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం నెమిల గ్రామంలో పశుసంవర్ధకశాఖ మాంస పరి శోధన సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు పెరటికోళ్లను అందజేశారు. అనంతరం వారు మాటా్లడుతూ, మహిళలు పెరటి కోళ్ల పెంపకం చేపట్టి ఆర్థికంగా ఎదగాలని కోరారు. గ్రామంలో 63 మందికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జానయ్య, మండల పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలివేరు బాలరాజు పశువైద్య సిబ్బంది అశోక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల నాణ్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బీఐఎస్ సంస్థ ప్రతినిధి ప్రశాంతి

మోత్కూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నాణ్యత లేని ఆభరణాలు కొని వినియోగదారులు నష్టపోవద్దని బీఐఎస్ సంస్థ ప్రతినిధులు శాస్త్రి, ప్రశాంతి అన్నారు. మంగళవారం బంగారు,వెండి ఆభరణాల నాణ్యత పరిశీలనపై మోత్కూరు ఆర్యవైశ్యభవన్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. వినియోగదారులతో పాటు మోత్కూరు, ఆత్మకూరు, గుండాల, అడ్డగూడూరు మండలాల స్వర్ణకారులు ఈ అవగాహన సమావేశంలో పాల్గొన్నారు. స్వర్ణకారుల సంఘం మోత్కూరు, గుండాల, ఆత్మకూరు మండలాల అధ్యక్షులు ఎ.వెంకటాచారి, అమరవాది వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, కన్నెకంటి శ్రీనివాస్, జయప్రసాద్ పాల్గొన్నారు.

ఎవరి కర్మ ఫలాన్ని వారే నిర్ణయించుకోవాలి

మేళ్లచెర్వు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భగవంతుడు అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తాడని, పట్టుదల, నిబద్ధత, ఏకాగ్రత, భక్తిశ్రద్ధల ద్వారా ఎవరి కర్మఫలాన్ని వారే నిర్ణయించుకోవాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి అన్నారు. మండల కేంద్రంలోని మైహోం సిమెంట్స్ పరి శ్రమలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి 27వ బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో అహోబిల రామానుజన్ జీయర్ స్వామితో కలిసి వేంకటేశ్వరస్వామికి ఏకోత్తర సహస్ర కలశాల అభిషేక మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1001 కలశాలతో సుగంధ పరిమళ ద్రవ్యాలు, కర్పూరం, పంచామృతాలతో స్వామికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నజీయర్‌స్వామి మాట్లాడుతూ సమస్త మానవాళి భగవంతుని అనుగ్రహానికి అర్హులేనని అన్నారు. దేశంలో అనేక దేవాలయాలను సంప్రదాయబద్ధంగా, ఆగమన పద్ధతిలో నిర్మించినందున అబాల గోపాలం నుంచి సామాజిక, సాంఘిక, మానసిక వికాస అభివృద్ధికి తోడ్పడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం చిన్నజీయర్‌స్వామికి మైహోం గ్రూప్ ఛైర్మన్ రామేశ్వరరావు దంపతులు పాదపూజ చేశారు. కార్యక్రమంలో శ్రీకుమారి, మునగాల రామ్మోహన్‌రావు, అరుణ, వైస్ ఛైర్మన్ వినోదరావు, భార్గవి, యూనిట్ హెడ్ ఎం. శ్రీనివాసరావు, వేద పండితులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.



మైహోం సిమెంట్స్ పరిశ్రమలో వేంకటేశ్వరస్వామికి అభిషేకం, 1001 కలశాలకు పూజలు చేస్తున్న చిన్నజీయర్‌స్వామి

రేషన్ బియ్యం పట్టివేత

మునగాల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మునగాల ఎస్ఐ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాలీ వాహనం డ్రైవర్ ఆకుల మహిపాల్ కోదాడ మండలం తమ్మరబండ పాలెం గ్రామానికి చెందిన రాయపుడి జానకి రాములు వద్ద 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లోడ్ చేసుకుని, సిద్దిపేట పట్టణానికి చెందిన సంజయ్‌కు విక్రయించడానికి వెళుతున్నట్లు తెలిపాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై మొద్దుల చెరువు సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ట్రాలీ వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పంచనామీ చేసి నిందితులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నెలాఖరులోగా 'భరోసా' పూర్తయ్యేనా?

(5వపేజీ తరువాయి)

జిల్లాలో 3.50లక్షల మంది, యాదాద్రి జిల్లాలో 2.10లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21లక్షల ఎకరాల వరకు సాగు భూమి ఉంది. వరుసగా వ్యవసాయ సీజన్లు ముగుస్తున్నా ప్రభుత్వం రైతులందరికీ పెట్టుబడి సాయం అందించలేకపోయింది. గత ప్రభుత్వ హయాంలో ఎంత భూమి ఉన్నా ఎకరానికి రూ.5వేల చొప్పున రైతుబంధు కింద వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేసింది. అయితే కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఎకరానికి రూ.7500 చొప్పున ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. అయితే ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఎకరానికి రూ.6వేల చొప్పున ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని నిర్ణయించి మూడు ఎకరాలు ఉన్న రైతులకు ఎకరానికి రూ.6వేల జమచేసింది.

రెండు సీజన్లు ముగిసినా..

యాసంగి సీజన్ ముగుస్తుండగా గత వానాకాలంతో పాటు ప్రస్తుత యాసంగి, మొత్తం రెండు సీజన్లకు కలిపి పెట్టుబడి సాయం ఇస్తారా అనే దానిపై స్పష్టత లేదు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం కోసం రైతులు ఎదురుచూపు చూస్తున్నారు. పంటల సాగుకు చేతిలో డబ్బు లేక రైతులు అప్పులు చేస్తున్నారు. ఎకరానికి రూ.25వేల చొప్పున పెట్టుబడులు వస్తోంది. పంట పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి డబ్బు తెచ్చి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కాంగ్రెస్ ఎకరాకు రూ.7,500 ఒక్కో సీజన్‌కు ఇస్తామని ప్రకటించడంతో ఎంతో ఆశాపడగా, తీరా ప్రభుత్వం ఎకరానికి రూ.6వేలు ఇచ్చేందుకు నిర్ణయించడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. ఈ నెలాఖరులోనైనా రైతుభరోసాపై నిర్ణయం తీసుకుంటారా? లేక వాయిదా వేస్తారా? అని రైతులు ఆందోళనలో ఉన్నారు. వాస్తవానికి గత వానాకాలంలోనే జూన్ నెలాఖరులోగా రైతుభరోసా రావాల్సి ఉంది. ప్రస్తుత యాసంగి సీజన్ ముగుస్తున్నా, ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులకు పాలుపోవడంలేదు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే ఈ నెలాఖరులోగా రైతుభరోసాపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నెలాఖరులోగా మరో రూ.230కోట్లు



ఇప్పటికే మూడు ఎకరాలున్న రైతులందరికీ రైతుభరోసా నిధులను వారి ఖాతాలో జమయ్యాయి. నెలాఖరులోగా ప్రతీ రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసాను అమలు చేయనుంది. ప్రతీ రైతుకు పెట్టుబడిసాయం అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసింది. వ్యవసాయ శాఖ పూర్తి స్థాయి డాటాను ప్రభుత్వానికి అందజేసింది. నెలాఖరు వరకు లక్షమంది రైతులకు మరో రూ.230కోట్ల మేర జమయ్యే అవకాశాలు ఉన్నాయి.

● పి.శ్రవణ్ కుమార్, జేడీఏ నల్లగొండ

నీటిని వృథా చేయొద్దు

కట్టంగూర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జీవకోటికి ప్రాణాధారమైన నీటిని సంరక్షించుకోవాలని ఎంఈవో అంబటి అంజయ్య అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కట్టంగూర్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి మంగళవారం బహుమతులు అందజేశారు. నీటిని వృథా చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆంటోని, విజయ్ కుమార్, విఠల్‌కుమార్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కట్టంగూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపల్లె గ్రామానికి చెందిన మేడి శివకుమార్ యువకుడు అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉట్కూరి ఏడుకొండలు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూకల సైదులు, గుండాల మల్లేశ్, మేకల రమేశ్, రాజు, నర్సింహ, వెంకన్న, సాయిలు పాల్గొన్నారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.32.28లక్షలు

నార్కట్‌పల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు ఆదాయం రూ.32,28,760లు సమకూరినట్లు ఈవో సిరికొండ నవీన్‌కుమార్ తెలిపారు. మొత్తం 41రోజులకు గుట్టపైన ప్రధానాలయం, ఉపాలయాల వద్ద ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా రూ.28,26,120లు గుట్ట కింద అమ్మవారి ఆలయ హుండీల వద్ద రూ.4,02,640లు, నిత్యాన్నదాన విరాళాల కింద రూ.1,15,730 వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ పరిశీలకుడు ఏడుకొండలు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



ఎల్లారెడ్డిగూడెంలో పీఏసీఎస్ సమావేశానికి హాజరైన సభ్యులు

నార్కట్‌పల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రుణాలు సకాలంలో చెల్లించి పీఏసీఎస్ బలోపేతానికి సహకరించాలని ఎల్లారెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ రేగట్టె నారాయణ రెడ్డి అన్నారు. కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. 2024-25లో సంఘం పరిధిలో రూ.3.44కోట్ల మేర రైతులకు పంట రుణాలు ఇచ్చామని, స్వల్పకాలిక రుణాలు రూ.70లక్షలు ఇచ్చామన్నారు వీటిలో రూ.2.34కోట్లను రికవరీ చేసినట్లు తెలిపారు. కొత్తగా స్వల్పకాలిక రుణాల కింద రూ.1.50కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ సారా శంకరయ్య, డైరెక్టర్లు దండు లింగయ్య, అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, ఉప్పుల రవీందర్‌రెడ్డి, గడుసు శశిధర్‌రెడ్డి, పన్నాల కృష్ణారెడ్డి, మేడి లక్ష్మమ్మ, ఊదరి అంజయ్య, మల్ల అండాలు, పులిపెల్లి శంకర్‌రెడ్డి, దాసరి మల్లేశ్, శంకరయ్య పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల నిరసన


నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

కనగల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నిరసనలో భాగంగా శాంతియుతంగా హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశా వర్కర్లను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు కనగల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి కానుగు లింగస్వామి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆశాలు సైదమ్మ, సునీత, కల్ప, శైలజ, స్వప్న, అలివేలు, వనత, అంజమ్మ ఉన్నారు.

మర్రిగూడ: మర్రిగూడలో నిరసన కార్యక్రమంలో ఆశా వర్కర్లు భాగ్యమ్మ, వసంత, తల్లోజు రామలింగాచారి, సునీత, కౌసల్య, బాలమణి, పద్మ ఉన్నారు.

నాంపల్లి: వీవోఏలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని వీవోఏల మండల అధ్యక్షురాలు ఎస్‌కే. సైదాబేగం అన్నారు. మంగళవారం మండలంలోని వీవోఏలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఫర్హానా, గడేపాక సంతోష, దీప, అలివేలు, రోజారమణి పాల్గొన్నారు.

'డీలిమిటేషన్ విధానంతో నష్టం'

మునుగోడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): డీలిమిటేషన్ విధానంతో దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంట్ ప్రాతినిధ్యంతో పాటు అన్నిరంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందని సామాజిక న్యాయ ఉద్యమ సమన్వయకర్త దొమ్మాట వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామిక దేశంలో భిన్న అస్తిత్వాలు, సంస్కృతులతో కూడిన సమాఖ్య ప్రాంతమైన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. డీలిమిటేషన్ పేరుతో బీజేపీ నేతలు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉందన్నారు. ఆ విధానం దేశాభివృద్ధి కోసమే అన్న సరైన భావన ఉంటే రాష్ట్రాల వారీ నష్టం జరుగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించవచ్చని సూచించారు. ఇప్పటికైనా కేంద్రం తమ వైఖరిని తెలియజేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర పునర్విభజనలో చట్టంలో పొందుపరిచిన డీలిమిటేషన్ హామీలు నెరవేర్చకపోవడం శోచనీయమని పేర్కొన్నారు.

ఏఐటీయూసీ మండల కమిటీ ఎన్నిక


నర్సింహ, రాములు

మునుగోడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీని మండలకేంద్రంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్ద నర్సింహ, కార్యదర్శిగా ఈద రాములు, గౌరవ అధ్యక్షుడిగా చాపల శ్రీను, ప్రచార కార్యదర్శిగా బెల్లం శివయ్య, ఉపాధ్యక్షులుగా దేవల మాలాద్రి, దర్శనం పాండు, సహాయ కార్యదర్శులుగా సైదులు, హుస్సేన్, యాసరాణి వెంకన్న, కోశాధికారిగా భీమనపల్లి స్వామి ఎన్నికయ్యారు.

ఏప్రిల్ 6న శ్రీరాముడి కల్యాణం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దేవాలయ ప్రతినిధులు

నల్లగొండ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రహ్మంగారి గుట్టపై వెలసిన సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఏప్రిల్ 6న శ్రీరాముడి కల్యాణం నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి రాములు, ఉపాధ్యక్షుడు కుప్పాల శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కార్యాలయంలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. బ్రహ్మంగారి గుట్టపై వెలసిన అతి పురాతన సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థాన ప్రధాన కార్యదర్శి చింత హరిప్రసాద్, కోశాధికారి పులిపాటి దయాకర్, పరమాత్మ, పాలకూరి నటరాజ్, విశ్వబ్రాహ్మణ జిల్లా సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి పెండోటు సోము, దాసోజు యాదగిరి, పర్వతం నరేంద్రబాబు, పాలకూరు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి


మర్రిగూడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం ప్రారంభమైనందున గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బక్క శ్రీనివాస్ సూచించారు. మండల అభివృద్ధి అధికారి గరికెల మున్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రిడ్ అధికారి వ్యవసాయ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అజిలాపురం, తమ్మడపల్లి, వట్టిపల్లి గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి ప్రారంభమైనందున ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ్మడపల్లి, అజిలాపురం, వట్టిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నీటి ఎద్దడిపై నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకునేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వెంకటేశ్వర్లుకు సూచించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఏఈ వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, గ్రిడ్ అధికారి వెంకట్, ఏవో సహస్ ఉన్నారు.

కోట్లు పోశారు.. పార్క్ మూశారు

● పార్క్ పేరుతో రూ.3కోట్ల ప్రజాధనం వృథా ● భూమి పార్క్‌కు పనికి రాదని తెలిసినా ఏర్పాటు ● ఇప్పటికీ ప్రారంభం కాని పార్క్


పార్క్‌లో గడ్డి మేస్తున్న పశువులు

నల్లగొండ రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలతో నిర్మించిన పార్క్ ప్రారంభించకుండానే మూత పడింది. ఆ భూమి పార్క్‌కు పనికిరాదని తెలిసినా ప్రజాప్రతినిధుల మెప్పు కోసం అధికారులు తహతహలాడారు. దీంతో రూ.3కోట్ల ప్రజాధనం వృథా అయింది. నల్లగొండ మునిసిపాలిటీ పరిధిలోని చర్లపల్లి గ్రామ శివారులో 2022లో సుమారు రూ.3కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి 14ఎకరాల్లో చర్లపల్లి అర్బన్ పార్క్ ఏర్పాటు చేశారు. చిన్న మొక్కలతో పాటు, పెద్ద వృక్షాలను కొత్త టెక్నాలజీతో ఒకచోట నుంచి పార్క్‌లో నాటారు. ఇందు కోసం ఒక్కో చెట్టుకు సుమారు రూ.50వేల ఖర్చు చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న 36చెట్లను చర్లపల్లి అర్బన్ పార్కుకు తరలించారు. చిన్నారులను ఆకట్టుకునేందుకు సుమారు రూ.2లక్షలతో పరికరాలు ఏర్పాటు చేశారు. పార్క్‌లో ప్రత్యేక సదుపాయాలు, నీటి కోసం బోరు, ప్రతి చెట్టుకు నీటిని అందించేందుకు పైపులైన్లు ఏర్పాటు చేశారు. గదులు, బాత్‌రూమ్‌లను ఏర్పాటు చేశారు. అవి ప్రస్తుతం మందు బాబులకు నిలయంగా మారాయి.


ప్రారంభానికి నోచుకోని చర్లపల్లి అర్బన్ పార్క్


పార్క్‌లో ఎండిన చెట్లు, నీళ్లతో నిండిన కుంట

పార్క్‌లో ఎండుతున్న చెట్లు



కొత్త టెక్నాలజీ ద్వారా పార్క్‌కు తరలించిన చెట్లు ఎండిపోయాయి. పార్క్ స్థలం ఐబీ ఆధీనంలో ఉంది. పక్కనే ఉన్న చెరువులోకి నీరు వచ్చినప్పుడు ఈ పార్క్‌లో సుమారు మూడు అడుగుల ఎత్తులో నీళ్లు నిలుస్తాయి. పార్క్‌లో లోతైన బావిని తలపించే గుంత తవ్వారు. ఇం దులోకి సమీపంలోని ఇళ్లనుంచి డ్రైనేజీ నిర్మించి ఆ నీటిని ఈ గుంత లోకి మళ్లించారు. ఈ స్థలం పార్క్‌కు పనికి రాదని తెలిసినా అప్పటి ప్రజాప్రతినిధుల మెప్పుకోసం అప్పటి అధికారులు నిర్మించారని విమర్శ లున్నాయి. ఈ పార్క్ సమీపంలో పశువుల మేతకు పనికి వస్తుంది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పార్కును నిరుపయోగంగా ఉంచారని చర్లపల్లికి చెందిన పిన్నపురెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. ప్రజలకు అనుకూలమైన చోట నిర్మిస్తే బాగుండేదని అన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం : బీజేపీ


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు మనోహర్‌రెడ్డి

నాంపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడి విమర్శించారు. మండలకేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీల్లో నేరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అరకొర బస్సులు ఏర్పాటు చేసి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దాచేపల్లి నర్సింహ, నాయకులు దూడల బిక్షం, కాసాల జనార్ధన్‌రెడ్డి, చిరుమామిళ్ల గిరిబాబు, శ్రీశైలం, పానగంటి మహేష్, నాంపల్లి సతీష్, భాస్కర్‌నాయక్, కాంతరెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి


షాపులను వెనక్కి జరపాలని సూచిస్తున్న ఎంపీవో సుధాకర్

నార్కట్‌పల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు వెడల్పులో నిర్మించిన డ్రైనేజీతో పాటు రోడ్డుపైకి చొచ్చుకు వచ్చి ఏర్పాటు చేసిన దుకాణాలను వెంటనే తొలగించాలని మండల పంచాయతీ అధికారి సుధాకర్ సూచించారు. లేనిపక్షంలో తామే తొలగిస్తామని ఆక్రమణదారులను హెచ్చరించారు. నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీకి ప్రతీ ఏడాది తైబజార్ వేలంతో కొంత ఆదాయం సమకూరుతుంది. 2024-25 సంవత్సరానికి గాను తైబజార్ కింద రూ.1.60లక్షల ఆదాయం సమకూరింది. ఈ మార్చి నెలాఖరుతో తైబజార్ వేలం కాల పరిమితి ముగియనుంది. దీంతో 2025-26 సంవత్సరానికి గాను మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో పశువుల సంతతో పాటు తైబజార్‌కు వేలం పాట నిర్వహించారు. తైబజార్ వేలానికి హాజరైన కాంట్రాక్టర్‌లు అపెసెట్ ధర కంటే తక్కువగా పాడి ఇందుకు గల కారణాలను గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టీసీ బస్టాండ్ గోడ వెంట ఉన్న స్థలాన్ని కొందరు అనధికారికంగా లీజుకు ఇచ్చుకోవడంతో ఆ స్థలాల్లో షాపులను నిర్వహిస్తున్న యజమానులు తమకు డబ్బులు ఇవ్వడం లేదని తైబజార్ కాంట్రాక్ట్ పొందేందుకు వేలందారులు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ ప్రహరీ గోడను ఆనుకుని డ్రైనేజీని, రోడ్డును ఆక్రమించి వేసిన షాపులను, డబ్బాలను వెనక్కి జరపాలని సూచించారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నాంపల్లి, మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్నూర్ గ్రామానికి చెందిన పంబాల శంకరమ్మ అనారోగ్యంతో పది రోజుల క్రితం మృతిచెందింది. మాజీ జడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. శంకరమ్మ భర్త పంబల యాదయ్యకు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ నక్క చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ సల్వాది రాములు, ఎస్‌కె అబ్బాస్, దండిగ సాలయ్య, జానీ, చిత్రియాల వెంకన్న, రాజు, రామస్వామి, వెంకన్న ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీపురం రాశీ ఫ్యాక్టరీస్ కాలనీలో గల భూదేవీ శ్రీదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణ మహోత్సవం జరిగింది. ప్రతీ ఏడాది ఫాల్గుణ ఏకాదశి పర్వదినాన స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. ఆలయ మంటపంలో జరిగిన ఈ వేడుక వద్ద కంపెనీ చైర్మన్ కొండా లక్షయ్య, మేనేజింగ్ డైరెక్టర్ వెంకన్న దంపతులు కూర్చుని కన్యాదాన పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించారు. ముత్యాల తలంబ్రాలను పోశారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య కల్యాణ తంతును యాజ్ఞీకుడు శ్రీకాంత్‌శర్మ, రాజేందర్‌శర్మ కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ వేడుకలో కొండా లక్ష్మయ్య, వెంకన్న, శ్రవణ్, భాస్కర్‌రావు, శ్రీకాంత్, బిక్షమయ్య, శ్రీనివాస్, సంపత్, సతీశ్, స్రవంతి, వెంకట్‌రెడ్డి, బొబ్బలి యాదగిరి, శాస్త్రి, నాగారాజు, కృష్ణ, దయాకర్, నర్సింహ పాల్గొన్నారు.

● మండల కేంద్రంలోని మునుగోడు రోడ్డులో ఉన్న రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం అమ్మవారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ కల్యాణోత్సవం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ వేడుకలో జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, పుల్లెంల ముత్తయ్య, అచ్చాలు, గాయం శ్యాంసుందర్‌రెడ్డి ఉత్సవ నిర్వహకులు ప్రజ్ఞాపురం రామకృష్ణ, సత్యనారాయణ, ఏ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగౌరి అవతారంలో ఎల్లమ్మ

కనగల్ : మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళ వారం అమ్మవారు భక్తులకు మంగళగౌరి అవతారంలో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి నిజాభిషేకాలు, బాలబోగ పూజలు జరిపి నాగహారతి ఇచ్చారు. వివిధ ప్రాం తాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించారు. చీరసారె ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



కనగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కట్టంగూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గంజి మురళీధర్, మండల కార్యదర్శి పెంజెర్ల సైదులు, నాయకులు రవీంద్రచారి, బక్కయ్య, రమేశ్, యాదయ్య, సుజాత, శ్రీను, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

నార్కట్‌పల్లి: సాగునీటి కొరత కారణంగా నార్కట్‌పల్లి మండలంలో ఎండిన పంటలకు ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు రెండు వేల ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోయాయన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పు శ్రవణ్, దండు రవి, ఆమనగంటి ఐలయ్య, సోమనబోయిన సైదులు, బొల్లెద్దు సైదులు, కట్ట రామచంద్రం, భగవంతరెడ్డి, దండు నాగరాజు, శ్రీను, లింగారెడ్డి, బిక్షం, గోపాల్, శంకర్, సత్యనారాయణ, చారి పాల్గొన్నారు.

మునుగోడు: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపటం తగదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బండా శ్రీశైలం అన్నారు. సీపీఎం పోరుబాటలో భాగంగా మండల పరిధిలోని గ్రామాల్లో చేపట్టిన సర్వేలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను గుర్తించారు. ఆ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రజలకు ఇచ్చిన ఆర గ్యారెంటీలను పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో నెలకొన్న కనీస సమస్యలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా సమస్యలకు పరిష్కార మార్గం చూపాలన్నారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, మిర్యాల భరత్, యాసరాణి శ్రీను, లింగస్వామి, వంటేపాక రమేష్, ఎర్ర సుధాకర్, మహేందర్ తదితరులు ఉన్నారు.

కనగల్: సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ 10 ఏళ్లుగా పేదలకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు కాక ఆయా వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటున్నారని అన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కానుగు లింగస్వామి, నాయకులు సుల్తానా, ఎండీ అక్రమ్, బ్రహ్మానందరెడ్డి, రామలింగయ్య, నర్సింహ్మా, రాములు, సైదులు, వెంకటమ్మనర్సమ్మ, పార్వతమ్మ, కృష్ణయ్య, లింగయ్య, వెంకన్న, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

పరీక్షలు సరిగా రాయలేదని మనస్తాపం


పూజితభార్గవి(ఫైల్)


కట్టంగూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సరిగ్గా రాయలేదని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన కట్టంగూరు మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూరు మండలకేంద్రానికి చెందిన చెరుకు నగేష్, సరితల ఏకైక కుమార్తె చెరుకు పూజిత భార్గవి(15) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సోమవారం జరిగిన ఆంగ్ల పరీక్ష సరిగా రాయలేదని మనస్తాపానికి గురైంది. తీవ్ర మనోవేదన చెందిన విద్యార్థిని మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చిన పూజిత తమ్ముడు అక్క ఉరేసుకున్న విషయాన్ని చుట్టపక్కల వారికి చెప్పాడు. కట్టంగూర్‌లోని ఓ కిరాణ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న తల్లి చుట్టుపక్కల నివాసితుల ద్వారా కుమార్తె ఆత్మహత్య విషయాన్ని తెలుసుకుని వచ్చి స్థానిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించాడు. సమాచారం అందుకున్న శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, కట్టంగూరు ఎస్.రవీందర్‌తో కలిసి వెళ్లి ఘటనా స్థలిని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూజితభార్గవి తల్లి సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. కాగా, తండ్రి బతుకుదెరువు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రిలో కూలీ పనికోసం వెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎండిన పంట పొలాల పరిశీలన


కుదాభక్షపల్లిలో ఎండిన వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మర్రిగూడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 'నీరు లేక ఎండుతున్న పంట పొలాలు' శీర్షికన ఆంధ్రజ్యోతి మినీ ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తకు జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారి సహస్ బృందం మండలంలోని కుదాభక్షపల్లి, పలు గ్రామాల్లో నీరు లేక ఎండుతున్న పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలంలో యాసంగిలో 4,380 ఎకరాల్లో రైతులు వరిపంట సాగు చేశారని తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేకు మండలంలో ఎండిన పొలాలను సర్వే నిర్వహించి ఆ నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.105	170	200
నల్లగొండ	రూ.110	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.5 । కనిష్ఠం 20.0



30న హుజూర్‌నగర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

- పర్యటన షెడ్యూల్ ఖరారు
- ఉగాది పర్వదినాన సన్న బియ్యం పంపిణీ ప్రారంభం
- మోడల్ కాలనీ ఇళ్లను పరిశీలించనున్న సీఎం
- భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు

సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 30న సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో పర్యటించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఖరారు కావడంతో పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30ఆదివారం సాయంత్రం 6గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హుజూర్‌నగర్ పట్టణంలో ప్రారంభించనున్నారు.

- (ఆంధ్రజ్యోతి,హుజూర్‌నగర్)

హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం సాయంత్రం 5గంటలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి బయలుదేరి 5.45గంటలకు హుజూర్‌నగర్‌లోని రామస్వామి గట్టు వద్ద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం నిర్మాణంలో ఉన్న 2,160 ఇళ్ల మోడల్ కాలనీని సీఎం పరిశీలిస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 6.15 గంటలకు పట్టణంలోని ఫణిగిరిగట్టు వద్ద రాజీవ్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతారు. ఉగాది పర్వదినం సందర్భంగా బహిరంగ సభలోనే సీఎం రేవంత్ రెడ్డి సన్నబియ్యం పంపిణీ పథకాన్ని లాంచనంగా ప్రారంభిస్తారు. 6.15 నుంచి 7.30గంటల వరకు సుమారు 40నిమిషాల పాటు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగసభలో ప్రసంగిస్తారు.

తిరిగి 7.30గంటలకు హుజూర్‌నగర్ నుంచి రోడ్డు మార్గంలో 9.45 గంటలకు హైదరాబాద్‌కు చేరుతారు. సభలో సీఎంతోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొంటారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 50వేల మంది సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు సాగుతున్నాయి. కాగా, సీఎం సభ సందర్భంగా మంగళవారం ఏర్పాట్లను పౌరసరఫరాశాఖ జాయింట్ సెక్రటరీ ప్రియాంకఅల, కలెక్టర్ తేజస్‌నందాలాల్, ఎస్పీ నర్సింహులు, అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:34 (బుధవారం సాయంత్రం)
సహర్: 4:53 (గురువారం ఉదయం)

ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

చిట్యాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ధర్మారెడ్డి, పిలాయిపల్లి వంటి చిన్ననీటి సాగు వనరులతో పాటు ఉదయసముద్రం, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం చిట్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు పనులతోపాటు కాల్వల నిర్మాణం పూర్తయితే జిల్లాలో ఇంత కరువు పరిస్థితులు ఉండేవి కాదన్నారు. ప్రాజెక్టుల పనుల పూర్తిపై ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. వరి చేలు ఎండిన రైతులకు ప్రభుత్వం రూ.30వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు వెంటనే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, అరూరి శ్రీను, పానుగుల్ల అచ్చాలు, బొబ్బల సుధాకర్‌రెడ్డి, కల్లూరి కుమారస్వామి, నకిరేకలంటి రాములు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



దేవరకొండ బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ మౌనిక


దేవరకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఏఎస్పీ మౌనిక హెచ్చరించారు. మంగళవారం దేవరకొండ బస్టాండ్, ప్రధాన కూడలీ వద్ద రోడ్ల వెంట వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారులతో ఆమె సమావేశమయ్యారు. రోడ్లపై వ్యాపారం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలన్నారు. ఆర్టీసీ అధికారులకు సహకరించాలని కోరారు. ఆమె వెంట ఆర్టీసీ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు, ఎస్ఐ అజ్మీర రమేష్, తదితరులు ఉన్నారు.

సాగర్ సీఐ బీసన్న బదిలీ

నూతన సీఐగా శ్రీనునాయక్

నాగార్జునసాగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ పోలీస్ సర్కిల్ సీఐ కె.బీసన్న బదిలీ అయ్యారు. ఆయన ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2023 మే నుంచి బీసన్న సాగర్ సీఐగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, ఆయన స్థానంలో నూతన సీఐగా నల్లగొండ డీసీబీలో పనిచేస్తున్న బి.శ్రీనునాయక్‌ను నియమించారు. ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

నెలాఖరులోగా భరోసా పూర్తయ్యేనా?



రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసాను నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో రైతుల ఖాతాలో జమ చేస్తామని పలుమార్లు ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రైతు భరోసాను ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 26న లాంఛనంగా ప్రారంభించింది. ఈ రోజున పైలెట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామం చొప్పున ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 గ్రామాలను ఎంపిక చేసి నూరు శాతం రైతుభరోసాను అమలు చేసింది. ఆ తరువాత కొందరి రైతులకే రైతుభరోసా అందింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- ఎదురుచూస్తున్న రైతులు
- సీజన్ గడిచిపోతున్నా పూర్తిస్థాయిలో అందని పెట్టుబడి సాయం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11లక్షల మందికి పైగా రైతులు

రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన, ఉమ్మడి జిల్లాలోని 73 గ్రామాల్లో, ఎంత సాగు భూమి ఉన్నా పూర్తి స్థాయిలో పెట్టుబడి సాయాన్ని చెల్లించింది. అనంతరం మూడు ఎకరాల వరకు రైతుభరోసా నగదును రైతుల ఖాతాల్లో జమచేసింది. ఆ తరువాత ఎన్ని ఎకరాలకు రైతుభరోసా ఇస్తామనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా గందరగోళంలో పడేసింది. చివరికి సాగులో ఎంత భూమి ఉన్నా రైతుభరోసా ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం దీనికి సంబంధించిన నగదు చెల్లించకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం గుట్టలకు, చెట్లకు, పుట్టలకు, రోడ్లకు, ఇటుక బట్టీల స్థలాలకు, వెంచర్ల స్థలాలకు రైతుబంధు పేరుతో డబ్బును వృథా చేసిందని నాడు కాంగ్రెస్ ఆరోపించింది.

అభిప్రాయాలు సేకరించినా..

గత పార్లమెంటు ఎన్నికల ముందు బీఆర్ఎస్ అమలు చేసిన రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేసింది. అయితే ఆ తరువాత ప్రభుత్వం రైతుభరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఎన్ని ఎకరాలకు రైతుభరోసా ఇవ్వాలనే దానిపై అభిప్రాయం సేకరించిన ప్రభుత్వం దాన్ని ఆటకెక్కించింది. అభిప్రాయాలపై అసెంబ్లీలో చర్చ పెట్టి అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం దీనిపై అసెంబ్లీలో చర్చను సైతం పక్కన పెట్టింది. రైతుల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ప్రభుత్వం జనవరి 26న రైతుభరోసా ప్రక్రియను ప్రారంభించినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. దీంతో వ్యవసాయ సీజన్‌లో రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక కొత్తగా పాస్‌పుస్తకాలు వచ్చిన రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వారు దరఖాస్తులు చేసుకున్నారు. వారితోపాటు పాస్‌పుస్తకాల్లో చేర్పులు, మార్పులు చేసుకున్న వారికి ఎకరం, రెండు ఎకరాలు, మూడు ఎకరాలు ఉన్న రైతులకు కూడా పెట్టుడిసాయం అందలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రూ.24వేల కోట్లకు పైగా కేటాయించింది. అందులో రూ.18వేల కోట్లను రైతుభరోసాకే కేటాయిస్తున్నట్లు పేర్కొంది. ప్రభుత్వం ఈ నెలఖరులోగా ఐదెకరాల వరకు రైతుభరోసా ఇస్తామని పేర్కొన్నా, అవి వస్తాయా? లేదా అనే సందేహం నెలకొంది.


గతంలో 11సార్లు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి రైతుకు ఎంత భూమి ఉన్నా 11సార్లు రైతుబంధును అమలు చేసింది. అప్పట్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సుమారు ప్రతీ సీజన్‌లో రూ.1,450కోట్లకు పైగా రైతుబంధు వచ్చేది. ప్రస్తుతం 11లక్షల మందికి పైగా రైతులకు గతం మాదిరిగా ఎకరాకు రూ.6 వేల చొప్పున ఏటా రెండు సీజన్లకు రూ.12వేలు చెల్లిస్తే ప్రభుత్వంపై మరింత భారం పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో తక్కువ భూమికే రైతుభరోసా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా? లేదా? ఇప్పటికే చెప్పిన విధంగా సేద్యం చేస్తున్న భూమి అంతంటికీ రైతుభరోసా కల్పిస్తుందా? అనేది వేచిచూడాల్సిందే.

ఉమ్మడి జిల్లాలో 11లక్షల మందికి పైగా రైతులు...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 11లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. అందులో నల్లగొండ జిల్లాలో 5.50 లక్షలు, సూర్యాపేట..

- మిగతా 7వ పేజీలో...



మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- నల్లగొండను రోల్‌మోడల్‌గా నిలపాలి : ఎస్పీ శరత్‌చంద్ర పవార్



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఉండి జిల్లాలో మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ ఆడిటోరియంలో ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందును ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రంజాన్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని, ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు పండగను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు మత సామరస్యంలో జిల్లాను రోల్‌మోడల్‌గా నిలపాలన్నారు. అందుకోసం అన్ని మతాలకు చెందిన వారు సోదరభావంతో మెలిగి భక్తి శ్రద్ధలతో పండుగలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, డీఎస్పీలు కొలను శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జయరాజు, సీఐలు,ఆర్ఐలు,ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సహకరించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్): యాసంగి ధాన్యం కొనుగోళ్లకు రైస్ మిల్లర్లు సంపూర్ణంగా సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. పెండింగ్ ట్రాన్స్‌పోర్ట్ బిల్లులు, పాత గన్నీ బ్యాగుల సమస్య, ఎఫ్‌సీఐ, 67 శాతం ఔటర్న్ వంటి సమస్యలను పరిష్కరించేందు సుముఖంగా ఉందన్నారు. మిల్లుల వారీగా పాతగన్నీ బ్యాగుల సమాచారాన్ని సేకరించాలని ఇన్‌చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో వానాకాలంలో జరిగిన లోపాలన్నింటినీ అధిగమించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్, ఇన్‌చార్జి డీఎస్‌వో హరీష్, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్, మార్కెటింగ్‌శాఖ ఏడీ ఛాయాదేవి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, భద్రాద్రి, తదితరులు పాల్గొన్నారు.

వీపీవో సేవలను వినియోగించుకోవాలి

నల్లగొండ క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు మెరుగైన సేవల కోసం వీపీవో (విలేజ్ పోలీస్ ఆఫీసర్) సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం రాత్రి నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విలేజ్ పోలీసింగ్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని, అంతేగాక నేరాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లోకి కొత్తగా వచ్చే అనుమానితుల సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలు విలేజ్ పోలీస్ అధికారికి అందించాలన్నారు. సైబర్ మోసాలకు గురికాకుండా అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. యువకులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా దృష్టిసారించాలన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలను విక్రయిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, టూటౌన్ సీఐ రాఘరావు, రూరల్ ఎస్ఐ సైదాబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి అంతరెడ్డి

నల్లగొండ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ మండలంలోని దండెంపల్లి గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పాం సాగులో ఎదురయ్యే సమస్యలపై అధికారులను సంప్రదిస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. జిల్లాలో పెద్ద మొత్తంలో ఆయిల్‌పాం సాగుకు రైతులు మొగ్గు చూపడం అభినందనీయమన్నారు. మొక్కల పెంపకం, యాజమాన్య పద్ధతులు, డ్రిప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు గాదె శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా నియామకాలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి

నల్లగొండ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిన బోధనా సిబ్బంది నియామకాలను పారదర్శకంగా నిర్వహించామని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సిబ్బంది నియామకం కోసం మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇంటర్వ్యూకు 15 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఫలితాలను మెడికల్ కళాశాల వెబ్‌సైట్లో ఉంచుతామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, డాక్టర్ వీనీలరాణి, డాక్టర్ మాతృ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

వేములపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.2,800 గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ఏడాది యాసంగి సీజన్‌లో సన్నరకం ధాన్యానికి రూ.2,800కు పైగా ధర పలకగా, ఈ ఏడాది అదే ధాన్యానికి మిల్లర్లు సిండికేట్‌గా మారి రూ.2,200 నుంచి రూ.2,300 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. రైతు పండించిన ప్రతీ గింజకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. దీంతో రైతులు మిల్లర్లను ఆశ్రయిస్తూ ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రూ.500 పొందలేక పోతున్నారని అన్నారు. అంతేగాక మిల్లర్లు క్వింటాకు రూ.500 ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని దీంతో క్వింటాకు రూ.1,000 మేర రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక మిల్లర్లు తాలు, గుమస్తాల, హమాలీ పేరుతో అదనంగా మరో రూ.100 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మిల్లర్లు ఇష్టారాజ్యంగా రైతులను దోచుకుంటున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు.

ఇప్పటికైనా అధికార యంత్రాంగం మిల్లుల వద్ద పర్యవేక్షణ ఏర్పాటుచేసి ధాన్యానికి రూ.2,800 ధర కల్పించేలా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రెమడాల పరుశురాములు, రొండి శ్రీనివాస్, పాల్వాయి రాంరెడ్డి, పాదూరి గోవర్ధని, పుల్లెంల శ్రీకర్, కోడిరెక్క వెంకన్న, చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, వడ్డెగాని సైదులు, అనిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పుట్టల సైదులు, సత్యనారాయణరెడ్డి, వల్లమల్ల ఎల్లయ్య, మల్లిఖార్జున్‌రావు, పెంటమల్ల సుకన్య, శీలం పద్మ, మాధవి, రాధిక, చారి, తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ యోల్గురి వల్లపురెడ్డి అన్నారు. మంగళవారం అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 50 శాతం పైగా రుణమాఫీ కాలేదన్నారు. సమావేశంలో నాయకులు అర్వపల్లి నర్సింహ, మాజీ సర్పంచ్ దేవవాత్ నరేందర్‌నాయక్, ఎర్ర యాదగిరి, రాయనబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ చోరీ

మాడ్గులపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవాపురం గ్రామంలోగల సీతారామాంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి హుండీ చోరీ జరిగింది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సీతారామాంజనేయస్వామి ఆలయంలోకి సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి ఆలయ హుండీని దొంగిలించారు. దొంగలించిన హుండీని ఆలయానికి కొద్ది దూరంలో గల వాగు పక్కన పడేశారన్నారు. హుండీలో సుమారు రూ.3వేల వరకు నగదు చోరీకి గురైందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి

పెద్దవూర, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు ఉచిత పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పులిచర్ల గ్రామంలో ఆయన పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని పశువులకు ఎలాంటి జబ్బు చేసినా రైతులు ఈ పశువైద్య శిబిరానికి తీసుకొచ్చి వైద్యం చేయించి ఉచితంగా మందులను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్, ఏఎంసీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, డైరెక్టర్లు లక్ష్మయ్య, గౌస్, రఘుపతిరెడ్డి, కోట నాగిరెడ్డి, పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా అమ్మానాన్న ఫౌండేషన్



ఆర్థిక సాయం అందజేస్తున్న పేలపూడి బాలకృష్ణ తదితరులు

నిడమనూరు, మార్చి25 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న నిరుపేదలకు అండగా ఉండేందుకే అమ్మానాన్న ఫౌండేషన్ పని చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ పేలపూడి బాలకృష్ణ తెలిపారు. సోమవారం రాత్రి నిడమనూరు మండలం బంకాపురం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గ్రామానికి చెందిన కొంగల ఆంజనేయులు కుటుంబానికి 132 మంది దాతల నుంచి సేకరించిన రూ.1,07,700లను అందజేసి మాట్లాడారు. గత సంవత్సరం ఫౌండేషన్ ద్వారా రూ.5,12,000 ఖర్చు చేసి పేద ప్రజలకు సేవలు అందించామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి రెండు నెలలపాటు చలివేంద్రం, మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఉన్నం చినవెంకటేశ్వర్లు, చిరుమామిళ్ల శ్రీనివాస్‌రావు, పాంపాటి యాదగిరి, గుండం రాజు వెంకటేశ్వరరావు, గుండా లింగయ్య, బండారు రామయ్య, సుదేశ్వరావు, బొంగల శ్రీనివాస్, రాంబాబు, చిన్న సత్యనారాయణ, గోపాల్‌రావు, శ్రీనివాస్‌రావు, కోటి, వెంకన్న, వెంకటేశ్వరరావు, శ్రీను, మధు, కోటేష్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వపల్లి తండా మాజీ సర్పంచ్ నామ అలెగ్జాండర్ అనారోగ్యంతో బాధపడుతున్నారని విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు భోగవెల్లి వెంకటరమణచౌదరిని మంగళవారం పరామర్శించారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.31వేల ఆర్థిక సహాయం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డిండి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు మంగళవారం తెలిపారు. డిండి వాగు నుంచి మండల కేంద్రానికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఉదయం 6 గంటల ప్రాంతంలో అదుపులోకి తీసుకొని నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలం కాంసానిపల్లికి చెందిన గజ్జె కురుమూర్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తిభవాన్ని పెంపొందించుకోవాలి

చింతపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని కుర్మేడ్‌లో ముత్యాలమ్మ బ్రహ్మోత్సవాలకు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, ఆర్ఎన్. ప్రసాద్, గుండ్లపల్లి నర్సిరెడ్డి, మాజీ సర్పంచి కాయితి జితేందర్ రెడ్డి, ఎరుకుల వెంకటయ్యగౌడ్, మాస భాస్కర్, ఎం.శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా రైతులు సద్వినియోగం చేసుకోవాలి

● ఏవో శ్రావణి కుమారి

చింతపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మహిళా రైతులందరూ ప్రభుత్వం మంజూరు చేసిన 50 శాతం రాయితీపై అందిస్తున్న పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని ఏవో శ్రావణికుమారి మంగళవారం తెలిపారు. రైతులకు వ్యవసాయ యాంత్రికరణ ద్వారా బ్యాటరీ స్ప్రేయర్లు 6, ప్రేయర్లు 6, రోటవేటర్లు 3, ట్రాక్టర్‌కు సంబంధించిన పనిముట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భూమి మహిళా రైతు పేరు మీద నమోదు చేసిన వారికి ఈ పనిముట్లు రాయితీపై అందిస్తామన్నారు. పాస్ పుస్తకం, ఆధార్ జీరాక్స్ ధ్రువీకరణ పత్రంతో పాటు పాస్ ఫొటోలను జతచేసి జాబితాలో అన్నీ వివరాలు నమోదు చేసి ఏఈవోలకు అందించాలని ఆమె సూచించారు.

కొండమల్లేపల్లి: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మహిళా రైతులకు ఎస్ఎంఎం పథకం ద్వారా 50శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులోన్నాయని ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి జానకిరాములు ఒక ప్రకటనలో తెలిపారు.

హాలియా: వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి మహిళా రైతులకు వ్యవసాయ యాంత్రీకరణపై సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానైజేషన్ పథకం ద్వారా 50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లకు బడ్జెట్ కేటాయించారని అనుముల మండల వ్యవసాయాధికారి సరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మాడ్గులపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని డీఎస్పీ రాజశేఖర్ రాజు అన్నారు. మంగళవారం మండలంలోని చెరువుపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణకు నల్లగొండ కళాజాత బృందంతో ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి రైతు మృతి

గుర్రంపోడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వద్దిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు వద్దిరెడ్డి రవీందర్‌రెడ్డి (55) సోమవారం ట్రాక్టర్‌పై నుంచి జారిపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వద్దిరెడ్డి రవీందర్‌రెడ్డి ట్రాక్టర్‌పై గడ్డిని తీసుకొస్తూ అకస్మాత్తుగా ట్రాక్టర్ ఆపి కిందకు దిగే ప్రయత్నం చేస్తూ జారిపడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల వారు హుటాహుటిన హైదరాబాద్‌లో యశోదా ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా నరాలు దెబ్బతిని ఉండవచ్చని భావిస్తున్నారు. రవీందర్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

పెద్దఅడిశర్లపల్లి, మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యడవెల్లి లక్ష్మారెడ్డి(54) అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం పాఠశాలలో డ్యూటీ చేసి మరుసటి రోజు ఆదివారం కావడంతో తన స్వగ్రామం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం పొట్లపాడు గ్రామానికి వెళ్లాడు. సోమవారం పాఠశాలకు వచ్చేక్రమంలో చాతీలో నొప్పిగా ఉందని పాఠశాలకు సెలవు పెట్టిన లక్ష్మారెడ్డి మంగళవారం మృతి చెందాడు. ఈయన 2022 జూన్ నుంచి డిప్యూటేషన్‌పై మండలంలో పనిచేస్తున్నారు.

ఆస్తి పన్ను చెల్లించాల్సిందే!

● మొండి బకాయిదారులపై కొరడా ఝులిపిస్తున్న అధికారులు ● సహకరించాలంటున్న కమిషనర్



పన్ను చెల్లించని ఓ ప్రైవేట్ సంస్థకు తాళం వేయిస్తున్న సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, తహసీల్దార్ హరిబాబు, మునిసిపల్ అధికారులు

ఆస్తి పన్ను వసూళ్లలో అధికారులు దూకుడు ప్రదర్శిస్తున్నారు. మొండి బకాయిదారులకు మొట్టికాయలు వేసి మరీ ఆస్తి పన్ను సేకరిస్తున్నారు. ఏళ్ల తరబడి పన్ను చెల్లించకుండా మిన్నకుండిన వారికి నోటీసులిచ్చి చట్టపరమైన చర్యలకు పాల్పడుతున్నారు. సబ్ కలెక్టర్, తహసీల్దార్, కమిషనర్‌లు స్వయంగా బకాయి ఉన్న వారిని కలవడంతో పాటు బద్ధకస్తులలో పై వరుసలో ఉన్న 100 మంది జాబితాను విడుదల చేశారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

మిర్యాలగూడ పట్టణంలోని 48 వార్డుల్లో 26,239 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇందులో 21,972 ఆవాసాలుండగా గృహేతర 2,120, మిక్స్‌డ్‌వి 1,603, కేంద్రప్రభుత్వ భవనాలు (అసెస్‌మెంట్లు) 155, రాష్ట్రప్రభుత్వ భవనాలు (అసెస్‌మెంట్లు)న్నాయి. ఇక ఆస్తి పన్ను మొత్తం డిమాండ్ రూ.883.30 కోట్లు కాగా, అందులో పాత బకాయిలు (పెనాల్టీతో కలిపి) రూ.646.86 కోట్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఆస్తి పన్ను లక్ష్యం రూ.21.80 కోట్లు కాగా, ఇప్పటికి రూ.8.50 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి రూ.4కోట్ల బకాయిలున్నాయి. ఇక ప్రభుత్వేతర ఆస్తులకు సంబంధించి పన్ను వసూళ్లకు నూతన పంథాను అవలంబిస్తున్నారు.

రోజువారీ సమీక్షలు.. భవనాలకు తాళాలు

100శాతం లక్ష్యంగా ఆస్తి పన్ను వసూళ్లకు మునిసిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మొండి బకాయిదారులతో కూడిన టాప్ 100 లిస్ట్‌ను అధికారులు విడుదల చేశారు. పన్ను వసూళ్లకు సంబంధించి సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ రోజువారీ సమీక్షలు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ హరిబాబు, కమిషనర్ యూసుఫ్‌లతో కలిసి ఆస్తి పన్ను వసూళ్ల (మొండి బకాయిదారుల వద్ద)కు స్వయంగా వెళ్లి పన్ను చెల్లించాలని కోరుతున్నారు. ప్రధానంగా రూ.5లక్షలు, ఆ పైన బకాయిలున్న యజమానులను ప్రత్యేకంగా కలిసి పన్ను చెల్లించాలని కోరుతున్నారు. అయినా స్పందించని యజమానుల దుకాణాలు, సంస్థలకు తాళాలు వేస్తున్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలోని ఆస్తులకు తాళాలు పడటంతో మొండి బకాయిదారులు మునిసిపల్ కార్యాలయానికి పరుగులెడుతున్నారు.

పన్ను చెల్లించి సహకరించాలి



ఏళ్ల తరబడి పన్ను చెల్లించకుంటే ఎలా.. పట్టణ ప్రజలు పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి. మొండి బకాయిదారులను పలుమార్లు కలిసి చెల్లించాలని అడిగాం. అయినా స్పందించడంలేదు. ఇక ఉపేక్షించేది లేదు. ఎవరైతే పన్ను చెల్లించరో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టానికి అనుగుణంగా స్పందించని యజమానుల ఆస్తి జప్తు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. పన్ను వసూళ్లకై పట్టణంలో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం.

మహ్మద్ యూసుఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

ఆశావర్కర్ల అరెస్టులు అప్రజాస్వామికం



పెద్దవూరలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

వేములపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు తమ సమస్యల పరిష్కారానికి పోరాడుతుంటే ప్రభుత్వం అక్రమ అరెస్టులతో నిర్బందించడం సరైంది కాదని సీఐటీయూ జిల్లానేత రొండి శ్రీనివాస్ అన్నారు. ఆశా వర్కర్లు శాంతియుంగా నిరసన తెలిపేందుకు హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా సోమవారం అర్ధరాత్రి నుంచే ఆశాలను, సీఐటీయూనేతలను ముందస్తు అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఆశా వర్కర్ల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కోడిరెక్క వెంకన్న, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు రెమడాల పరుశురాములు, ఐద్వా నాయకురాలు గోవర్ధని, రాధిక, సుకన్య, విఘ్నేశ్వరి, దేవకమ్మ, సుజాత, మంగమ్మ, జయమ్మ, రజిత, రేణుక, ఝాన్సీ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు

పెద్దవూర, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్బంధాలతో ఆశా కార్యకర్తల ఉద్యమాన్ని ఆపలేరని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆశా కార్యకర్తల ఛలో హైదరాబాద్ సందర్భంగా ఆశాలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో నిరసన ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రశ్నించే హక్కును కాలరాసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు, ప్రసూతి సెలవులు, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌కె.బషీర్, కేవీపీఎస్ నాయకులు నాగార్జున, ఆశా వర్కర్లు జంపాల వెంకటమ్మ, జయమ్మ, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేయాలి



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న భాస్కరశర్మ

దేవరకొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ అభ్యుదయ సంఘం గౌరవ అధ్యక్షుడు డేగం భాస్కరశర్మ అన్నారు. మంగళవారం దేవరకొండ కోదండ రామాలయంలో ఉగాది పండుగ పురస్కరించుకొని విశ్వావసునామ సంవత్సర నూతన పంచాంగాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. బ్రాహ్మణ పరిషత్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించిందన్నారు.బ్రాహ్మణ విద్యార్థుల చదువులకు, బ్రాహ్మణ భవన నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలన్నారు. దేవరకొండ నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కుర్మేటి రవిప్రసాద్‌శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వంశీకృష్ణ, సురభి కృష్ణమూర్తి, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌శర్మ, వైద్యుల కృష్ణమూర్తిశర్మ, గాదె గిరిధర్‌రావు, గంప ప్రవీన్‌శర్మ, సాయివిశ్వనాధ్‌శర్మ, భాస్కరశర్మ, బిక్షపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీలను అమలు చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



తహసీల్దార్ హరిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న రంగారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నెల రోజులు గ్రామాల్లో ప్రజాపోరు బాట నిర్వహించి ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి మంగళవారం తహసీల్దార్ హరిబాబుకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏళ్లుగా మిర్యాలగూడ నియోజకవర్గంలో 12 ఏళ్లుగా ఒక్క ఇల్లు కూడ పేదలకు మంజూరు చేయలేదన్నారు. అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ, ఇండ్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. మిర్యాలగూడ, ఆలగడప, కొత్తగూడెం, లావుడితండాలలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అందించాలన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, గాదె పద్మ, తిరుపతి రాంమూర్తి, సత్యనారాయణ, పిల్లుట్ల సైదులు, కోడిరెక్క మల్లయ్య, కందుకూరి రమేష్‌బాబు, వాడపల్లి రమేష్, మాధవరెడ్డి, నగేశ్, ఆశీర్వాదం, అరుణ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



మిర్యాలగూడలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

మిర్యాలగూడ లీగల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి కోర్టు న్యాయవాది ఎర్రబాబు ఇజ్రాయిల్ దారుణ హత్యను నిరసిస్తూ న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించారు. మంగళవారం బార్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన అత్యవసర సమావేశంలో ఇజ్రాయిల్ హత్యను న్యాయవాదులు ముక్తకంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకినాల వేలాద్రి మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తక్షణమే రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కేసులను వాదిస్తే చంపేస్తారా అని ఆయన ప్రశ్నించారు. నిందితుడిపై తక్షణమే న్యాయపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కోర్టు ఎదుట అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలనే నినాదాలతో న్యాయవాదులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎండీ ఇబ్రహీం, ట్రెజరీ ఎంవీ పవన్‌కుమార్, న్యాయవాదులు మంద సైదులు, పూసపాటి పరమేష్, మక్తాల రాములు, నాగేందర్, మట్టయ్య, రవినాయక్, పగిడి అంజనేయులు, ప్రభాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని దేవరకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు అన్నారు. మంగళవారం దేవరకొండలో హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయిల్‌పై దాడిచేసి హత్య చేసిన నింధితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తు కోర్టు విధులను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలతో పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహనికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. తెలంగాణలో న్యాయాన్ని రక్షించే న్యాయవాదులకే రక్షణలేకుండా పోయిందన్నారు. న్యాయవాదులపై దాడులు, హత్యలు చేస్తున్న నింధితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈకార్యక్రమంలో న్యాయవాదులు నెమికంటి రమాశంకర్, గట్టు ఇంద్రవరప్రసాద్‌రావు, మాడెం రాములు, ముస్తాక్, ఎర్ర కృష్ణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కొండమల్లేపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బీఆర్ఎస్ రాష్ట్రనేత నేనావత్ కిషన్‌నాయక్ అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో తెలంగాణ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న వాలీబాల్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు తమలోని క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇస్లావత్ అభిషేక్, నేనావత్ రమేష్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, లతీఫ్, హబీబ్, అబిరూబ్, అబిరూబ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కిషన్‌నాయక్

అడ్డంకులను తొలగించాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీసి నేత లింగంగౌడ్ వినతి

● ఏప్రిల్ 5వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలి

మిర్యాలగూడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువవికాస్ పథకం దరఖాస్తులో సాంకేతిక అడ్డంకులను తొలగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. మంగళవారం ఆయన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువకులు స్వయం ఉపాధి పొందేందుకు రూ.లక్షల వరకు సబ్సిడితో కూడిన రుణాలు అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించిందన్నారు. ఏప్రిల్ 5వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని గడువు విధించినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు రుణాలు అందిస్తామని దరఖాస్తులు స్వీకరించినప్పటికీ అనేక మందికి రుణ మంజూరు చేయలేదన్నారు. ఆ దరఖాస్తులు ఆన్‌లైన్‌లోనే ఉన్నాయన్నారు. ఇప్పుడు రాజీవ్ యువవికాస్ కింద దరఖాస్తు చేసుకుంటే గత ప్రభుత్వంలో లబ్ధి పొందినట్లు ఆన్‌లైన్‌లో ఆల్రెడీ అప్లోడ్ అని వస్తుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గతంలో రుణం పొందని నిరుద్యోగులకు లబ్ధి చేకూరేలా గతంలో చేసిన దరఖాస్తులనైనా పరిగణలోకి తీసుకునేలా చూడాలని కోరారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

నిడమనూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పేద ప్రజలకు ఇంటిస్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలు అమలు చేయడంలో, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అనంతరం తహసీల్దార్ జంగాల కృష్ణయ్యకు ప్రజా సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు కందుకూరి కోటేష్, ఆకారపు నరేష్, కొమాండ్ల గుర్వయ్య, మల్లికంటి చంద్రశేఖర్, నల్లబోతు సోమయ్య, మహేష్, పుల్లయ్య, నాగరాజు, కొండేటి సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి, ఆర్‌అండ్‌బీ రోడ్లు, మురుగుకాల్వలు, సీసీ రోడ్లు వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేసి ఆయన మాట్లాడారు. శిరసన గ్రామంలో సర్వే నెం.93లో 30 దళిత కుటుంబాలు పోరంబోకు భూమిని గత 15 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని, వారికి ప్రభుత్వం పట్టాలు అందించాలన్నారు. అదేవిధంగా బస్సు సౌకర్యం లేని గ్రామాలకు బస్సులు నడపాలని, గ్రామాల్లో మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు, పెన్షన్లు అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, మండల నాయకులు ఎస్‌కె.బషీర్, దోరెపల్లి మల్లయ్య, దొంతల నాగార్జున, నాయకులు తుడుం వెంకటయ్య, దోరెపల్లి సైదులు, వెంకన్న, సైదమ్మ, లక్ష్మయ్య ఉన్నారు.

దామరచర్ల: ఎన్నికల్లో హామి ఇచ్చిన విధంగా ప్రభుత్వం ప్రజలకు ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇండ్ల స్థలాలు అందించాలన్నారు. రైతులందరికి రుణమాఫీ చేయాలని, రైతు భరోసా నిధులను విడుదల చేయాలని, ధాన్యానికి మద్దతు ధర రూ.2800 కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వినోద్‌నాయక్, పాపానాయక్, దయానంద్, కోటిరెడ్డి, మట్టారెడ్డి, విజయ్, కాంతారావు, దుర్గయ్య, శాంతమ్మ, సుభాని, మట్టయ్య పాల్గొన్నారు.